www.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

బుధవారం 29 అక్టోబర్ 2025

సంగారెడ్డి సంచిక :62 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## భారీగా పడిపోయిన బంగారం ధరలు..!

ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మహిళలు బంగారు అభర ణాలు ధరిస్తారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని మహిళలందరూ బంగారానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. అనేక రకాల డిజైన్లతో లక్షల్లో విలువ చేసే కమ్మలు, నెక్లెస్లు, బ్యాంగిల్స్ వంటివి కొనుగోలు చేస్తుంటారు. ఆడవాళ్లకు ప్రతిరోజూ షాపింగ్ చేసిన బోర్ కొట్టదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు. కాగా గోల్డ్ రేట్లు ఎప్పుడెప్పుడు తగ్గుతాయా? అంటూ మహిళలు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. కాస్త పసిడి ధరలు తగ్గుముఖం పట్టగానే బంగారం షాపుల్లో ఎగబడుతారు. అయితే ఇటీవల బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ రేట్లతో మహిళల్లో ఓసారి ఉత్సాహం నెలకొనగా... మరోసారి నిరాశకు గురవుతుంటారు.

# హైదరాబాద్‌కు హాలీవుడ్‌ను రప్పిస్తాం



- సినీ టికెట్ ధరల పెంపుపై సీఎం రేవంత్ కీలక వాఖ్యలు
- హైదరాబాద్ నగరం ప్రపంచ సినీ పరిశ్రమకు వేదిక కావాలి: సీఎం రేవంత్
- సినీ కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాలలు నిర్మిస్తా
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- 'హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీలో, హైదరాబాద్‌లో.. షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం
- సినీ కార్మికుల కోసం ప్రభుత్వం తరపున చేయగలిగిన పనులు చేస్తా.

హైదరాబాద్

భారత్ ఫ్యూచర్ సిటీలో సినీపరిశ్రమకు ప్రాధాన్యం ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సినీ కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాలలు నిర్మిస్తానని ఉద్ఘాటించారు. సినీ కార్మికుల పిల్లలకి ఉచితంగా చదువు చెప్పిస్తామని నొక్కిచెప్పారు. సోమవారం) యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్‌లో సినీ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని సినీ ప్రముఖులు సన్మానిం చారు. సీఎం రేవంత్‌రెడ్డి సన్మాన సభకు సినీ ప్రముఖులు భారీగా తరలివచ్చారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో - మిగతా3లో



## ప్రతీ ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం

- ఇక జీవిక పథకం కింద ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు
- గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి నాయకత్వం వహించే మహిళల కోసం జీవిక అనే పథకం అమలు
- దినికింద పని చేసేవారిని ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు

## మొంథా ఎఫెక్ట్.. తెలంగాణలో మూడురోజులు
# భారీ వర్షాలు

- ఈ జిల్లాలకు రెడ్ అలెర్ట్..!
- ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలు
- గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల ప్రపంచవేగంతో గాలులు



హైదరాబాద్

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను మొథా ప్రభావంతో తెలంగాణలో రాగల మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించింది. మొంథా తుఫాను గడిచిన 6 గంటలుగా 15 కిలోమీటర్ల వేగంతో కదులుతున్నదని.. ప్రస్తుతం ఏపీలోని మచిలీపట్నానికి 110 కిలోమీటర్లు, కాకినాడకు 190, విశాఖపట్నానికి 280 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైందని చెప్పింది. ఈ రాత్రికి కాకినాడ తీరంలో తుపాను తీరం దాటే ఛాన్స్ ఉందని.. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల ప్రపంచవేగంతో గాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. మంగళవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మూడు జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ - మిగతా3లో



## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

- 8వ కేంద్ర వేతన సంఘం విధివిధానాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల పెంపుపై సిఫార్సులు
- నియామకం జరిగిన 18 నెలల్లోగా కమిషన్ నివేదిక సమర్పణ
- దేశ ఆర్థిక పరిస్థితి, రాష్ట్రాలపై ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోనున్న సంఘం
- సుమారు 50 లక్షల ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం
- 2026 జనవరి 1 నుంచి సిఫార్సులు అమల్లోకి వచ్చే అవకాశం

## జూబ్లీహిల్స్ బై పోల్‌కు
# సర్వం సిద్ధం

- 127 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు
- నియోజకవర్గం వ్యాప్తంగా 127 పోలింగ్ కేంద్రాల్లో 407 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు
- ఒక్కో పోలింగ్ బూత్‌కి నాలుగు చొప్పున 1,628 బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల అధికారులు సిద్ధం
- ఉప ఎన్నికలో భాగంగా 509 కంట్రోల్ యూనిట్లు, 509 వీవీ ప్యాట్లు సిద్ధం




హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా 127 పోలింగ్ కేంద్రాల్లో 407 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో పోలింగ్ బూత్‌కి నాలుగు చొప్పున 1,628 బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల అధికారులు సిద్ధం చేశారు. అదనంగా 20 శాతం బ్యాలెట్ యూనిట్లను సిద్ధంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఉప ఎన్నికలో భాగంగా 509 కంట్రోల్ యూనిట్లు, 509 వీవీ ప్యాట్లు సిద్ధం చేశారు. ఇప్పటికే ఈవీఎంల ర్యాండమైజేషన్ - మిగతా3లో



## ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా
# పాకిస్థాన్‌లోని లాహోర్

- నగరంలో 329గా నమోదైన ప్రమాదకర ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- కాలుష్య నగరాల జాబితాలో మూడో స్థానంలో కరాచీ
- పంజాబ్ ప్రావిన్స్ వ్యాప్తంగా నెలకొన్న ప్రజారోగ్య సంక్షోభం
- తీవ్ర ఆరోగ్య సమస్యలు తప్పవని హెచ్చరిస్తున్న నిపుణులు
- ఇళ్లకే పరిమితం కావాలని ప్రజలకు అధికారుల సూచన

## అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్
# తయారు చేయాలి



- సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపై సీఎం సమీక్ష..
- శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలి
- తుమ్మిడిహట్టిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు పలు సూచనలు
- బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలి
- ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలి

హైదరాబాద్

తుమ్మిడిహట్టి దగ్గర చేపట్టాల్సిన ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయం లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారు లకి సీఎం పలు కీలక సూచనలు చేశారు. తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80టీఎంసీల నీటిని తరలించేందుకు.. ప్రణాళి కలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగు నీరు అందించాలని మార్గనిర్దేశం చేశారు. తుమ్మిడిహట్టి దగ్గర పాత పనులను ఉపయోగించుకుంటూ.. అంచనాలను తయారు చేయాలని సీఎం - మిగతా3లో



## తీరానికి చేరువవుతున్న మొంథా.. భారత రైల్వే శాఖ అప్రమత్తం

- తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ సర్వసన్నద్ధంగా ఉండాలి
- తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి

# ప్రతీ ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం

**పట్నా:** బిహార్‌లో మ్యానిఫెస్టో వేడి షురూ అయ్యింది. బిహార్ రాష్ట్రంలో ప్రతిపక్ష ఇండియా కూటమి మంగళవారం(అక్టోబర్ 28వ తేదీ) తమ మ్యానిఫెస్టోను ప్రకటించింది. ప్రతీ ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం అనే అంశాన్ని మ్యానిఫెస్టోలు చేర్చింది. తాము గెలిస్తే ప్రతీ ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మహాఘట్ బంధన్(మహా కూటమి) సీఎం అభ్యర్థి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ఈ మేరకు మ్యానిఫెస్టో విడుదల చేసిన ఆయన.. తమ కూటమి గెలిచిన పక్షంలో 20 రోజుల్లోపే ప్రతీ ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అదే అంశాన్ని మ్యానిఫెస్టోలో చేర్చామన్నారు. ఇక జీవిక పథకం కింద ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు ఇస్తామన్నారు. గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి నాయకత్వం వహించే మహిళల కోసం జీవిక అనే పథకం అమలు చేస్తున్నారు. దీనికింద పని చేసేవారిని ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు ఇస్తామన్నారు. కాగా, బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రెండు విడతల్లో (నవంబర్ 6, 11) జరుగుతుంది. నవంబర్ 14న ఫలితాలు వస్తాయి.



**27 మంది తిరుగుబాటు నేతల బహిష్కరణ**

రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) తాజాగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలపై 27 మంది నేతలను పార్టీ నుండి ఆరేళ్లపాటు బహిష్కరించింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుండి వచ్చిన అధికారిక ప్రకటన ప్రకారం ఈ జాబితాలో వివిధ నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి దిగిన లేదా అధికారిక ఆర్‌జేడీ అభ్యర్థులను వ్యతిరేకిస్తున్న నేతలు ఉన్నారు.

**20 నెలల్లోనే..**

నవంబర్‌లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ వేడి మరింతగా రాజుకుంటోంది. అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ)ప్రతిపక్ష మహాఘట్ బంధన్.. రెండూ కూడా పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకుంటున్నాయి. అదే సమయంలో ప్రజలకు హామీలను కూడా గుప్పిస్తున్నాయి. రెండు రోజుల క్రితం పట్నాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కేవలం 20 నెలల్లో బీహార్‌ను నంబర్ వన్ చేస్తామని పేర్కొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇది శుభవార్త. లక్షలాది మంది ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్ర కేబినెట్.. 8వ వేతన సంఘం ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలకు ఆమోదముద్ర వేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షనర్ల చెల్లింపుల పెంపుపై ఈ కమిషన్ త్వరలో తన పనిని ప్రారంభించనుంది.

ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మందికి పైగా పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. వేతన సంఘం ఒక తాత్కాలిక వ్యవస్థలా పనిచేస్తుంది. ఇందులో ఒక ఛైర్‌పర్సన్, ఒక పార్ట్‌టైమ్ సభ్యుడు, ఒక మెంబర్-సెక్రటరీ ఉంటారు. ఈ కమిషన్ తన నియామకం జరిగిన తేదీ నుంచి 18 నెలల్లోగా ప్రభుత్వానికి తన సిఫార్సులను సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైతే, తుది సిఫార్సులకు ముందే మధ్యంతర



నివేదికలు కూడా ఇచ్చే వెసులుబాటును కల్పించారు. సిఫార్సులు చేసేటప్పుడు కమిషన్ పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కేబినెట్ నిర్దేశించింది. దేశ ఆర్థిక పరిస్థితి, ఆర్థిక క్రమశిక్షణ ఆవశ్యకత, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల లభ్యత వంటి అంశాలను పరిశీలించనుంది. అలాగే, ఈ సిఫార్సుల ప్రభావం రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందో కూడా అంచనా వేయనుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ రంగంలోని ఉద్యోగుల జీతభత్యాలు, పని పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని నివేదిక రూపొందించాల్సి ఉంటుంది. సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. ఉద్యోగుల జీతభత్యాలు, పదవీ విరమణ ప్రయోజనాలు, ఇతర సేవా నిబంధనలను సమీక్షించి, వాటిలో మార్పులను సూచించడం ఈ కమిషన్ ప్రధాన విధి. ఈ క్రమంలో, 8వ వేతన సంఘం సిఫార్సులు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. 7వ వేతన సంఘాన్ని 2014 ఫిబ్రవరిలో ఏర్పాటు చేయగా, దాని సిఫార్సులను ప్రభుత్వం 2016 జనవరి నుంచి అమలు చేసిన విషయం తెలిసిందే. 8వ వేతన సంఘం ఏర్పాటుపై ప్రభుత్వం 2025 జనవరిలో ప్రకటన చేసింది. తాజాగా కేబినెట్ ఆమోదంతో ఈ ప్రక్రియ అధికారికంగా ముందుకు సాగనుంది.

# ఆరెస్సెస్ కార్యకలాపాలపై ఆంక్షలు.. సిద్ధరామయ్య ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురు

**ఆరెస్సెస్ కార్యకలాపాలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు**

**రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై మధ్యంతర స్టే విధించిన హైకోర్టు**

**తదుపరి విచారణ 17వ తేదీకి వాయిదా**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకలాపాల వ్యవహారంలో కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఆరెస్సెస్ తదితర సంస్థల కార్యకలాపాలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు మంగళవారం మధ్యంతర స్టే విధించింది. తదుపరి విచారణను హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ నవంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. ఆరెస్సెస్ ఏర్పడి వందేళ్లయిన నేపథ్యంలో భారీస్థాయిలో కవాతులు నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో సిద్ధరామయ్య ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు సంస్థలు, సంఘాలు తమ కార్యకలాపాల కోసం ప్రభుత్వ మైదానాలు, రహదారులు, బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థల ఆవరణలను వినియోగించుకోవాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి చేసింది. ఈ మేరకు అక్టోబర్ 18న కర్ణాటక ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘిస్తే



చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అన్ని జిల్లాల యంత్రాంగాలను ఆదేశించింది. అయితే రాష్ట్రంలో అరెస్సెస్‌ను నిషేధించే ఉద్దేశంతో సిద్ధరామయ్య ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

# ‘భజనలో.. గోల్డ్ మెడల్ నీకేపో!’

ఒకవేళ భజన అనే పోటీ గనుక ఒలింపిక్స్‌లో ఉండి ఉంటే.. పాకిస్తాన్‌కు కచ్చితంగా ఆ పోటీల్లో గోల్డ్ మెడల్ వచ్చి తీరేదేమో!. విన్నర్ పోడియంలో ఎవరికీ అందనంత ఎత్తులో ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఉండి ఉండేవారేమో!.. ఈ మాటలు అంటోంది ఆ దేశ మాజీ దౌత్యవేత్త హుస్సేన్ హక్కానీ. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విపరీతమైన ప్రశంసలు గుప్పించాడు. కంబోడియా-థాయ్‌లాండ్ మధ్య తాజాగా కౌలాలంపూర్ ట్రంప్ సమక్షంలో శాంతి ఒప్పందం కుదరింది. ఈ నేపథ్యంలో.. శాంతి, స్థిరత్వానికి కృషి చేసే నాయకుండంటూ పాక్ ప్రధాని విపరీతమైన పొగడ్తలు గుప్పించారు. మొన్న గాజా శాంతి ప్రణాళిక.. ఇప్పుడేమో ఇది. మధ్యప్రాచ్యం, దక్షిణాసియాలో శాంతి కోసం ట్రంప్ చేసిన కృషి ప్రపంచాన్ని రక్షించింది. లక్షల మంది ప్రాణాలు




పోకుండా నిలబెట్టింది అని షెహబాజ్ పేర్కొన్నారు. దీనిపై పాకిస్తాన్ మాజీ అమెరికా రాయబారి హుస్సేన్ హక్కానీ, షెహబాజ్ షరీఫ్‌పై వ్యంగ్యంగా స్పందించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ట్రంప్‌ను పొగడటంలో ఒలింపిక్ గోల్డ్ మెడల్ గెలిచే స్థాయిలో ఉన్నారంటూ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ఫరీద్ జకారియా వ్యాఖ్యలను ఉటంకిస్తూ.. ‘ఇది ఒలింపిక్ క్రీడ అయితే, షరీఫ్ పోడియం మీద గోల్డ్ మెడల్‌తో నిలిచేవారు అని అన్నారు. ఈజిప్ట్‌లో జరిగిన గాజా శాంతి సదస్సులోనూ షరీఫ్ ట్రంప్‌ను విపరీతంగా పొడిగారు. ట్రంప్‌ను శాంతి పురుషుడిగా అభివర్ణిస్తూ నోబెల్ శాంతి బహుమతికి అర్హుడంటూ మాట్లాడారు. ఆ సమయంలో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ చిత్రమైన హావభావాలు ప్రదర్శించడం విపరీతంగా వైరల్ అయ్యింది. షరీఫ్ మాటలతో కడుపు నిండిపోయిన ట్రంప్ ‘ఇక మాట్లాడేం లేదని, ఇంటికి వెళ్లిపోదాం’ అంటూ వ్యంగ్యంఆ స్పందించడం మరో కొసమెరుపు. అయితే షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలను పాక్ పౌరులే భరించలేకపోయారు. అంతలా దిగజారి పొగడాల్సిన అవసరం ఏముందంటూ.. ప్రధానిని తిట్టిపోశారు కూడా.

## తీరానికి చేరువవుతున్న మొంథా.. భారత రైల్వే శాఖ అప్రమత్తం



‘మొంథా’ తుఫాను ముంచుకొస్తుండటంతో భారత రైల్వే శాఖ అప్రమత్తమైంది. తక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుగా తెలుగు రాష్ట్రాల్లో, ఒడిశాలో డివిజనల్ వార్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలైన దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ సర్వసన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రత్యేకించి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం డివిజన్ల పరిధిలో అవసరమైన యంత్రాలు, సామగ్రితోపాటు సిబ్బందిని తక్షణమే అందుబాటులో ఉంచాలన్నారు. తుఫాను వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారుల నుంచి నివేదిక కోరారు. తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టంచేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే తక్షణం స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. తుఫాను కారణంగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించాలని పేర్కొన్నారు.

## ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా పాకిస్థాన్‌లోని లాహోర్



పాకిస్థాన్‌లోని లాహోర్ నగరం మరోసారి వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మంగళవారం దట్టమైన పొగమంచు (స్మాగ్) నగరాన్ని కమ్మేయడంతో, ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది. స్విస్ ఎయిర్ క్వాలిటీ మానిటర్ ‘ఐక్యూఎయిర్’ ప్రకారం, మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో లాహోర్ వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 329గా నమోదైంది. అంతకుముందు ఉదయం లాహోర్ ఏక్యూఐ 424 వద్ద ఉందని, ఆరోగ్యానికి అత్యంత హానికరమైన పీఎం 2.5 కణాల స్థాయి 287గా నమోదైందని పాకిస్థాన్ పత్రిక ‘ది న్యూస్ ఇంటర్నేషనల్’ నివేదించింది. లాహోర్‌తో పాటు, కరాచీ నగరం కూడా ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాల జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. ఇక్కడ ఏక్యూఐ 174గా రికార్డయింది. ఈ స్థాయిలో కాలుష్యానికి ఎక్కువసేపు గురికావడం వల్ల గుండె జబ్బులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, స్ట్రోక్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పాకిస్థాన్‌కు చెందిన ‘డాన్’ పత్రిక కథనం ప్రకారం, అల్లామా ఇక్బాల్ టౌన్‌లోని సిటీ స్కూల్ వద్ద ఏక్యూఐ 505గా నమోదయింది. ఇది అత్యవసర ఆరోగ్య హెచ్చరిక స్థాయికి సమానం. ఫౌజీ ఫర్టిలైజర్ పాకిస్థాన్ పరిశ్రమ వద్ద ఏక్యూఐ 525గా రికార్డవగా, ఈ ప్రాంతాల్లోని లక్షలాది మంది ప్రాణాంతకమైన గాలిని పీలుస్తున్నారని స్పష్టమవుతోంది. ఈ స్మాగ్ ఎమర్జెన్సీతో పంజాబ్ ప్రావిన్స్‌ను అప్రమత్తం చేశారు. ఫైసలాబాద్, ముల్తాన్ నగరాల్లో ఏక్యూఐ వరుసగా 439, 438గా నమోదైంది. దీంతో పంజాబ్‌లో ప్రజారోగ్య సంక్షోభం నెలకొంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రతి ఏటా పొగమంచు, వాహన, పారిశ్రామిక కాలుష్యం, వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం వల్ల లాహోర్‌లో ఈ విపత్తు పునరావృతమవుతోంది.

## ఘోర విమాన ప్రమాదం.. 12మంది దుర్మరణం

**నైరోబి:** కెన్యాలో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 12మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం ఉదయం కెన్యాలోని క్వాలే కౌంటీలో విమానం కూలింది. పర్యాటకులతో ప్రయాణిస్తున్న విమానం డయాని నుండి మాసాయి మారాలో



కిచ్వా టెంబోకు బయలుదేరింది. అయితే బయలుదేరిన కొద్దిసేపటికే కూలిపోయింది. విమాన ప్రమాదాన్ని కెన్యా పౌర విమానయాన అథారిటీ (కేసీఏఏ) ధృవీకరించింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. ‘డయాని నుండి కిచ్వా టెంబోకు వెళు తున్న 5%-జజూా% రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన విమానం ఉదయం 8.30 గంటల సమయంలో కూలిపోయింది. విమానంలో 12మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు , దాని ప్రభావాన్ని నిర్ధారించేందుకు ప్రభుత్వ అధికారులు ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లారు’ అని కెన్యా సివిల్ ఏవియేషన్ అథారిటీ ప్రకటనలో పేర్కొంది. పోలీసుల ప్రకారం.. విమాన ప్రమాదంలో మరణించిన 12 మంది ప్రయాణికులు పర్యాటకులని తేలింది. ప్రమాదానికి ఖచ్చితమైన కారణాన్ని పరిశీలించడానికి,దర్యాప్తు చేయడానికి ప్రభుత్వ సంస్థలు ఇప్పటికే సంఘటనా స్థలానికి చేరుకున్నాయని కేసీఏఏ డైరెక్టర్ ఎమిలే ఎన్.రావు తెలిపారు. ప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఇంకా నిర్ధారించబడినప్పటికీ, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ విషాదం చోటు చేసుకుందని స్థానిక మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఉదయం నుండి, తీరప్రాంతం పొగమంచు, మేఘాలతో కప్పబడి ఉండటం వల్ల పైలట్ నియంత్రణ కోల్పోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ కథనాల్లో హైలెట్ చేశారు.

# ఎల్ అండ్ టీ స్వాధీనం వెనుక...
# బ్యాక్ డోర్ పాలిటిక్స్

**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండగా పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ఆర్థిక విధానాలపై తీవ్ర విమర్శలు చేసింది. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగానే మిగులు బడ్జె ట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ఆరోపించింది. కానీ 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ పరిపాలన.. తీసుకుంటున్న నిర్ణయాలు అటు రాజకీయ విశ్లేష కుల నుంచి, ఇటు ప్రజల నుంచి విమర్శలకు తావిస్తు న్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ధోరణి ఆర్థిక నియంత్రణ లేమి, రాజకీయ స్వార్థ ప్రయోజనాలకు అద్దం పడుతుంది. ఈ దిశగా హైదరాబాద్ మెట్రో రైల్ అంశంలో తెలంగాణ ప్రభు త్వం తాజాగా తీసుకున్న నిర్ణయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవలి వరకు లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్అండ్‌టీ) ఆధ్వర్యంలో కొనసాగిన మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీంతో రాష్ట్ర ప్రజలపై సుమారు రూ. 30 వేల కోట్ల అప్పుల భారాన్ని మోపిందనే ఆరోపణలు వినిపి స్తున్నాయి. అయితే మెట్రో రైల్ స్వాధీనం చేసుకోవడంతో పరోక్షంగా ప్రజలపై వేల కోట్ల అప్పుల భారాన్ని మోపిన ప్రభుత్వం త్వరలోనే ప్రత్యక్షంగా ప్రజల జేబులు గుల్ల చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల బస్సు ఛార్జీలు పెంచిన రేవంత్‌రెడ్డి సర్కార్, ప్రస్తు తం అనివార్యంగా మెట్రో టికెట్ ఛార్జీలను పెంచనున్నట్టు అధికార వర్గాల నుంచి సంకేతాలు వస్తున్నాయి.



2017లో పబ్లిక్- ప్రైవేట్ పార్టనర్‌షిప్(పీపీపీ) పద్ధతిలో ఒప్పందం కుదుర్చుకున్న ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ఆపరేషన్లు చేపట్టింది. కానీ ఇప్పుడు ఆ ఒప్పందాన్ని రద్దు చేసి, ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం పట్ల అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదొక 'బ్యాక్‌డోర్ డీల్' అని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే మెట్రో రైల్ నుంచి ఎల్ అండ్ టీ సంస్థను తప్పించడం ద్వారా ప్రజలపై వేల కోట్ల భారం తప్పదంటున్నారుప్రభుత్వం మొత్తం ప్రాజెక్ట్‌ను స్వాధీనం చేసుకుంటే భయంకర నష్టాలు తప్పవని, ప్రభుత్వం నిర్ణయం తీసుకునే ఒక వారం ముందే సూచించింది. కానీ ఆ హెచ్చరికలను ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఎల్ అండ్ టీ భారీ నష్టాల్లో ఉన్నప్పటికీ పెనాల్టీ లేకుండా ఒప్పందాన్ని ముందుగానే ముగించుకోవడమంటే కార్పొరేట్ సంస్థకు నష్టం రాకుండా ప్రభుత్వమే కాపాడిందని విజయక్రాంతి విమర్శించింది. ప్రజల సొమ్ముతో ప్రైవేట్ సంస్థలను కాపాడే కొత్త మోడల్ ఇది అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నా రు. సచివాలయ అధికారుల సమాచారం ప్రకారం.. ఎల్ అండ్ టీ లాభాలు కరోనా తర్వాత కూలిపోయాయి. మెట్రో ప్రయాణికుల సంఖ్య కూడా కరోనా పరిస్థితి ముందు కంటే ప్రస్తుతం 30 శాతం తగ్గింది. పైగా కొత్త మార్గాల విస్తరణలో జాప్యం జరగడం, అధిక నిర్వహణ వ్యయాలు ఎల్ అండ్ టీ సంస్థను ఆర్థికంగా భయపెట్టాయి. మెట్రో ప్రాజెక్ట్‌లో ఎల్ అండ్ టీ పెట్టిన రూ. 14,000 కోట్ల ఈక్విటీ జాప్యం, భూసేకరణ వివాదాలు, టికెట్ ధరల పరిమితి కారణంగా క్రమంగా నష్టాలబాట మొదలైంది. 2025 మధ్య నాటికి సంస్థ నష్టాలు భరించలేమంటూ ప్రాజెక్ట్ నుంచి బయటకు రావ డానికి ప్రభుత్వంతో సంప్రదింపులు మొదలుపెట్టింది. ఈ క్రమంలో అక్టోబర్ 18న కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా ఆస్తిని ప్రజలకే తిరిగి ఇవ్వడమంటూ ప్రాజెక్ట్ స్వాధీనం చేసుకుంది. కానీ ఒప్పందంలోని షరతులు పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. ఎల్ అండ్ టీ లాభాలను తిరిగి వసూళ్లు, పనితీరు లోపాలపై జరిమానా వంటి అంశాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. దీంతో ఎల్ అండ్ టీ సంస్థ పెద్దగా నష్టమేమీ లేకుండా, పరిహారం కూడా తీసుకుని ప్రాజెక్టు నుంచి వైదొలగింది. ప్రభుత్వం మాత్రం మొత్తం నష్టాన్ని భరించేందుకు అంగీకరించింది. ఇది ప్రైవేట్ సంస్థల లాభాలకు ప్రజల డబ్బుతో రక్షణ కల్పించడమేనని, ఇది ఆ సంస్థకు ప్రభుత్వమే ఇచ్చిన గోల్డెన్ ఎగ్జిట్ అని విశ్లేషకులు చెబుతున్నారు.

**మెట్రో నష్టం.. ప్రజలపై భారం...**

రవాణా శాఖ అధికారుల సమాచారం ప్రకారం జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత ప్రజలకు ప్రభుత్వం భారీ షాక్ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు రూ.10-60 మ ధ్య ఉన్న మెట్రో ఛార్జీలు డిసెంబర్ నాటికి 50- 100 శాతం పెరగవచ్చని సమాచారం. దీం తో 10 కిలోమీటర్ల ప్రయాణం ఇప్పటి రూ. 40 నుంచి నేరుగా రూ. 80కు ఎగబాకే అవకాశం ఉంది. మెట్రోలో రోజూ ప్రయాణించే 5 లక్షల ప్రయాణికులకు ఇది పెద్ద దెబ్బగా మారుతుంది. రోజువారీ కూలీలు, విద్యార్థులు, ఐటీ ఉద్యోగులందరూ ఈ భా రాన్ని మోయాల్సిందే. 'ద్రవ్యోల్బణం పేరిట సెప్టెంబర్‌లో ఇప్పటికే బస్సు ఛార్జీలు 25 శాతం పెం చారు. ఇప్పుడు మెట్రో కూడా పెంచితే మే మేం చేయాల'ని ఒక ప్రయాణికురాలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ధనవం తుల రక్షణ కో సం పేదల జేబులు కొల్లగొడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. 2023లో ఎన్నికల సమయంలో 'ప్రభుత్వానికి ప్రజలే ముఖ్యం..అని అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు అదే ప్రజలపై మెట్రో అప్పుల భారం మోపుతున్నారని విమర్శకులు చెబుతున్నారు. 69 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్--1, ట్రాఫిక్ జామ్‌లతో ఉక్కిరిబిక్కిరవుతున్న నగరానికి ఊపిరి అందిం చాలనే లక్ష్యంతో ప్రారంభమైంది. కానీ ఎల్ అండ్ టీ నిర్వహణలో అది 'నష్టాల కేంద్రం'గా మారింది. కేసీఆర్ హయాం లో భూ స్కాంలు, కరోనా సమయంలో పనులు ఆగిపోవడంతో రూ.14,000 కోట్లు గా ప్రారంభమైన ప్రాజెక్ట్ వ్యయం, క్రమంగా రూ. 18,000 కోట్లకు ఎగబాకింది. పీపీపీ మోడల్‌ను 'ఇన్నోవేటివ్ సొల్యూషన్'గా మొ దట్లో కొనియాడినప్పటికీ వాస్తవానికి అదే ఈ ప్రాజెక్ట్‌ను కుదేలుచేసింది. ఎల్ అండ్ టీకి ఆదాయంలో 90 శాతం వాటా ఇస్తూ 'బ్రేక్ ఈవెన్' అయిన తర్వాత 70-30 నిష్పత్తిలో వాటా అనే షరతు పెట్టారు. కానీ ఆ బ్రే క్ ఈవెన్ అసలు రాలేదు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్ స్వాధీనం చేసుకోవాలనే నిర్ణయం తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టంగా మారబోతోందని నిపుణుల హెచ్చరిస్తున్నారు. ఈ టేకోవర్ ద్వారా ఎల్ అండ్ టీ సంస్థ నష్టాలను ప్రభుత్వం భరిస్తోంది. అయితే దీని ద్వారా రూ. 55 వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని అంచనా కాగా, అదనంగా ఎల్ అండ్ టీ తీసుకున్న రూ. 13,000 కోట్ల రుణభారం కూడా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ భుజాలపై పడనుంది. దీనికి తోడు ఒప్పందం ముందుగానే రద్దు చేసుకున్నందుకుగాను ఎల్ అండ్ టీ సంస్థకు ప్రభుత్వం మరో రూ. 2,000 కోట్లు పరిహారంగా చెల్లించనుంది. మొత్తం మీద, మొదటి దశలోనే రూ. 70 వేల కోట్లకు పైగా భారమని అధికారులు వెల్లడిస్తున్నారు. కానీ ఈ నష్టం ఇంతటితో ఆగదని, ప్రాజెక్ట్ నిర్వహణ, సంరక్షణ, వడ్డీ చెల్లింపులు, ఖర్చులు కలిపి రాబోయే 40 ఏళ్లలో అదనంగా మరో రూ. 50 వేల కోట్లకు పైగా భారమయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. దీనిని ఒక తరం ప్రజలపై నెమ్మదిగా అమలయ్యే ఆర్థిక దోపిడీగా విమర్శకులు అభివర్ణిస్తున్నారు. మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవడం ద్వారా ఎదురయ్యే ఆర్థిక ప్రతికూలతలు తక్షణమే కనిపిస్తున్నాయి. మెట్రో రైళ్లు కొనసాగించడమే కాకుండా, ఓల్డ్ సిటీ, శంషాబాద్ వరకు ఫేజ్--2 విస్తరణకు కావాల్సిన నిధుల కోసం ప్రభుత్వం 2026 నాటికి మరో రూ. 15,000 కోట్లు అప్పు తీసుకోవాల్సి వస్తుంది. కానీ ఇక్కడే అసలు సమస్య ఉంది. ఎల్ అండ్ టీ తన ఏఏఏ క్రెడిట్ రేటింగ్, బ్రాండ్ వాల్యూతో కేవలం 6.5 శాతం వడ్డీతోనే రుణాలు పొందేది. కానీ ఇప్పటికే రూ. 3 లక్షల కోట్లకు చేరుకున్న రాష్ట్ర అప్పులు కారణంగా బ్యాంకులు ఇప్పుడు 11 శాతం వడ్డీని ప్రభుత్వం నుంచి డిమాండ్ చేస్తున్నాయి. వడ్డీ రేటులో ఉన్న 4.5 శాతం తేడాతో ప్రతి ఏడాది రాష్ట్ర ఖజానా నుంచి రూ. 700 కోట్లు అదనపు వడ్డీగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే లోపాలున్నప్పటికీ ఎల్ అండ్ టీ సంస్థలో మెట్రో రైల్ నిర్వహణ వ్యవస్థను సాంకేతికత ఆధారంగా, క్రమపద్ధతిలో, తక్కువ సిబ్బందితో నడిచేది. కానీ ఇప్పుడు ప్రభుత్వ ఆధీనంలోకి రావడంతో పాలన ఆలస్యం, అధికారుల జోక్యం వంటి అంశాలు నిర్వహణను మరింత కష్టతరం చేస్తాయని నిపుణుల అంచనా వేస్తున్నారు. ప్రాథమిక ఆడిట్ నివేదికల ప్రకారం.. ప్రభుత్వ నిర్వహణలో 20-25 శాతం అదనంగా నిర్వహణ నష్టం వాటిల్లుతుందని స్పష్టమవుతున్నది. అంటే ప్రతి ఏడాది రూ. 1,500 కోట్ల నష్టం వస్తుంది. కానీ మెట్రో ఆదాయం మాత్రం రూ. 800 కోట్ల వద్దే స్థిరంగా ఉంది. జీహెచ్ఎంసీ ఎన్నికలు నవంబర్ 2025లో జరగనున్న తరుణం లో ఈ టేకోవర్ ప్రకటించడం రాజకీయంగా పెద్ద వ్యూహం అని విశ్లేష కులు అంటున్నారు. నాయకత్వం బలంగా ఉందనే మేజెస్ ఇవ్వడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నా రు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓట్లు వేసిన తర్వాత టికెట్ ధరల పెంపు నిర్ణయాన్ని వెల్లడించనున్నారు. కానీ ఓటర్లు మౌనంగా లేరు. సోషల్ మీ డియా అంతా మెట్రోస్కామ్ హ్యాష్‌ట్యాగ్‌లతో వైరల్ అవుతున్నది. ఆర్థికంగా దెబ్బతిన్న రాష్ట్రంలో ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ సమస్య కాదని, ప్రభుత్వ ఆర్థిక ప్రణాళికల వైఫల్యానికి ప్రతీక అని నిపుణులు అభిప్రా యపడుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర అప్పు-జీఎస్‌డీపీ నిష్పత్తి 35 శాతం దాటే దశలో ఉంది. ఈ టేకోవర్ తరువాత ఆ నిష్పత్తి మరింత పెరుగుతుంది. సామాజిక సంక్షేమ పథ కాలకు కేటాయింపులు తగ్గిపోవడం, మెట్రోవిస్తరణ కలలు వాయిదా పడడం తప్పదని హెచ్చరిస్తున్నారు. మెట్రో ప్రాజెక్టు కింద ఇప్పుడున్న ఆస్తులు ఏమౌతాయోనన్న ఆందోళన కూడా నగరవాసుల్లో వ్యక్తమవు తున్నది. కానీ మరోవైపు ఎల్అండ్ టీ మాత్రం లాభపడింది. మెట్రో ప్రాజెక్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ప్రకటన వెలువడగానే ఎల్అండ్‌టీ కంపెనీ షేర్ విలు వ 2 శాతం పెరిగింది. దీనిని క్లీన్ ఎగ్జిట్ అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత ప్రజలకు ప్రభుత్వం భారీ షాక్ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు రూ. 10-60 మధ్య ఉన్న మెట్రో ఛార్జీలు డిసెంబర్ నాటికి 50-100 శాతం పెరగవచ్చని సమాచారం. దీంతో 10 కిలోమీటర్ల ప్రయాణం ఇప్పటి రూ. 40 నుంచి నేరుగా రూ. 80కు ఎగబాకే అవకాశం ఉంది. మెట్రోలో రోజూ ప్రయాణించే 5 లక్షల ప్రయాణికులకు ఇది పెద్ద దెబ్బగా మారుతుంది. రోజువారీ కూలీలు, విద్యార్థులు, ఐటీ ఉద్యోగులందరూ ఈ భారాన్ని మోయాల్సిందే. ద్రవ్యోల్బణం పేరిట, సెప్టెంబర్‌లో ఇప్పటికే బస్సు ఛార్జీలు 25 శాతం పెంచారు. ఇప్పుడు మెట్రో కూడా పెంచితే మేమేం చేయాల'ని ఒక ప్రయాణికురాలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ధనవంతుల రక్షణ కోసం పేదల జేబులు కొల్లగొడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2023లో ఎన్నికల సమయంలో 'ప్రభుత్వానికి ప్రజలే ముఖ్యం.. అని అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు అదే ప్రజలపై మెట్రో అప్పుల భారం మోపుతున్నారని విమర్శకులు అంటున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు నవంబర్ 2025లో జరగనున్న తరుణంలో ప్రభుత్వం మెట్రో టేకోవర్ ప్రకటించడం రాజకీయంగా పెద్ద వ్యూహం అని విశ్లేషకులు అంటున్నారు.

## వందల కోట్ల నుంచి 15 కోట్లకు... పడిపోయిన గులాబీ విరాళాలు



**హైదరాబాద్ :** బెంగాల్లో మమ తకు.. తమిళనాడులో స్టాలిన్ కు, ఏపీలో చంద్రబాబుకు.. అంతకు ముందు జగన్మోహన్ రెడ్డికి ఎవరికీ చేతకాలేదు. వాళ్ల వల్ల కా లేదు.. వాస్తవానికి కుటుంబ పార్టీ లలో.. కనివిని ఎరుగని స్థాయిలో ట్రెండ్ సృష్టించారు కేసీఆర్. అధికారంలో ఉన్నప్పుడు తన పార్టీని ఏకంగా జాతీయస్థాయిలో నిలబెట్టాలని ప్రయత్నం చేశాడు. గాలి మోటార్ లో దేశ మొత్తం తిరిగాడు. అసలు ప్రతిపక్ష కూటమికి తానే ఫండింగ్ చేస్తానని చెప్పాడు. అటువంటి కెసిఆర్ ఇప్పుడు ఫామ్ హౌస్ కు పరిమిత మయ్యాడు. బిడ్డను పార్టీ నుంచి బయటికి పంపించాడు. అసెంబ్లీ ఎన్నికల్లో దారుణమైన ఫలితాలు.. పార్లమెంట్ ఎన్నికలు 0 ఫలితాలు.. అంతే ఇప్పుడు కారు పార్టీని దేకే వాడు లేడు. ఈ మాట అంటున్నది మేం కాదు. ఎన్నికల సంఘానికి స్వయంగా భారత రాష్ట్ర సమితి ఇచ్చిన రిపోర్టు. 2023 -2024 కాలానికి భారత రాష్ట్ర సమితికి ఏకంగా 580.52 కోట్లు విరాళాల రూపంలో వచ్చాయి.. ఇందులో ఎలక్టోరల్ బాండ్ల ద్వారానే భారత రాష్ట్ర సమితికి 495.52 కోట్లు వచ్చాయి. ఇందులో ప్రడెంట్ ఎలక్టో రల్ ట్రస్టు ద్వారా ఏకంగా 85 కోట్లు లభించాయి. 2022 -23 సంవత్సరానికి సంబంధించి భారత రాష్ట్ర సమితికి 683.06 కోట్లు వచ్చాయి. ఇందులో బాండ్ల రూపంలో 529 కోట్లు, ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి 90 కోట్లు.. వివిధ వ్యక్తుల నుంచి 64.3 కోట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు.. పార్లమెంట్ ఎన్నికల్లో 0 ఫలితాలు రావడంతో కారు పార్టీ పరిస్థితి దారుణంగా మారిపోయింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత వచ్చిన ఉప ఎన్నికలో కారు పార్టీ దారుణంగా బోల్తా పడింది. దీనికి తోడు ఆ పార్టీ నుంచి కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఆ పార్టీని పెద్దగా పట్టించుకునే వారు లేకుండా పోయారు. 2024 -25 లో పార్టీకి 15,09,08,141 మాత్రమే వచ్చాయని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు.. ఇప్పుడు గులాబీ పార్టీ అధికారంలో లేకపోవడంతో.. కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. అజ్ఞాత వ్యక్తులు విరాళాలు ప్రకటించడం లేదు.. రాజ్యసభ సభ్యత్వం పొందినవారు.. ఇంకా అనేక రకాల మేళు ్ళ పొందినవారు పార్టీని పట్టించుకోవడం లేదు. అందువల్లే గులాబీ పార్టీకి విరాళాలు ఏకంగా 97 శాతానికి పడిపోయాయి. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విరాళాలు ఇవ్వడానికి కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. నాయకులు కూడా పోటీపడ్డారు. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం హుండీ మాదిరిగా భారత రాష్ట్ర సమితి అధికారిక ఖాతా నిండుగా ఉండేది. నిత్యం డబ్బులు రాకతో కళ కళ లాడుతూ కనిపించేది. ఇప్పుడు అధికారం పోయిన తర్వాత కెసిఆర్ వ్యవసాయ క్షేత్రానికి పరిమితమయ్యారు. పార్టీ మొత్తం కేటీఆర్ చేతుల్లోకి వెళ్లిపోయింది. కల్వకుంట్ల కవిత బయటికి వెళ్లిపోయింది. ఒకవేళ ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గులాబీ పార్టీకి సానుకూల ఫలితం రాకపోతే పరిస్థితి మరో విధంగా ఉంటుంది.

## జూబ్లీహిల్స్ బై పోల్‌కు సర్వం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

పూర్తై పోయిందన్నారు. ఇక జూబ్లీహిల్స్ బై పోల్ నేపథ్యంలో నేడు నియోజకవర్గానికి కేంద్ర బలగాలు రానున్నాయి. ఏడు కంపెనీల కేంద్ర బలగాలతో పాటు 1600 మంది లోకల్ పోలీసులతో భారీ బందోబస్తు కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు అభ్యర్థులు చేసిన ఖర్చుల రిజిస్టర్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులకు చూపించాలని ఆదేశించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇక బీఆర్ఎస్ తరపున ఆయన సతీమణి మాగంటి సునీత, కాంగ్రెస్ తరపున నవీన్ యాదవ్, బీజేపీ తరపున దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. నిరుద్యోగుల తరపున మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆస్మా కూడా పోటీలో ఉన్నారు. నవంబర్ 11వ తేదీన ఉప ఎన్నికకు పోలింగ్ జరగనుంది.

## అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలి

-మొదటిపేజీ తరువాయి

సూచించారు. సుందిళ్లకి రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని ఆజ్ఞాపించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**సీఆర్ పాటిల్ లేఖపై చర్చ..**

అలాగే, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల లేఖ రాశారు. ఈ లేఖపై ఈరోజు జరిగిన సమీక్షలో ఉన్నతాధికారులతో రేవంత్‌రెడ్డి చర్చించారు. సీఆర్ పాటిల్‌కి తాను రాసిన లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించారు సీఎం. తుమ్మిడిహట్టిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ లేఖలో పేర్కొన్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రాజెక్టుల వారీగా అధ్యయనం చేసి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైనా సీఎం చర్చించారు. బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు.

## మొంథా ఎఫెక్ట్..
## తెలంగాణలో మూడురోజులు భారీ వర్షాలు..

-మొదటిపేజీ తరువాయి

జారీ చేసింది. మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. గడిచిన 24గంటల్లో ఆసిఫాబాద్, సంగారెడ్డి, మెదక్, మంచిర్యాల, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్గొండతో పాటు పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో 6.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని టీజీడీపీఎస్ చెప్పింది.

## హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు రప్పిస్తాం

-మొదటిపేజీ తరువాయి

నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఒకప్పుడు తెలుగు పరిశ్రమ మదరాసి అని పిలిచేవారని చెప్పుకొచ్చారు. తెలుగు పరిశ్రమను హైదరాబాద్‌కు తరలించాలని.. ఆనాటి సీఎం మర్రి చెన్నారెడ్డి తీవ్ర కృషి చేశారని తెలిపారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ వంటి వారిని మర్రి చెన్నారెడ్డి సంప్రదించి హైదరాబాద్‌కు వచ్చేందుకు కృషి చేశారని ఉద్ఘాటించారు. చిత్రపురి కాలనీకి ప్రపంచస్థాయి గుర్తింపునకు ఆనాటి నాయకులు కృషి చేశారు చిత్రపరిశ్రమను ప్రోత్సహించాలని తక్కువ ధరకే స్టూడియోలకు భూములు ఇచ్చామని నొక్కిచెప్పారు. రామానాయుడు, పద్మాలయా, అన్నపూర్ణ స్టూడియోలకు అప్పటి సీఎంలు చౌకగా భూములు కేటాయించారని పేర్కొన్నారు సీఎం రేవంత్‌రెడ్డి.

**సినీ కార్మికుల శ్రమ, కష్టం నాకు తెలుసు..**

'కళాకారులను గౌరవించాలని 1964లో నంది అవార్డు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకారులకు కావాల్సింది డబ్బు కాదు.. జనం కొట్టే చపట్లు.. కప్పే దుప్పట్లు. సినీ కార్మికుల శ్రమ, కష్టం నాకు తెలుసు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పదేళ్లు అవార్డులు ఇవ్వలేదు. మేము అధికారంలోకి వచ్చాక గద్దర్ పేరు మీద సినీ అవార్డులు ఇచ్చాం. హైదరాబాద్ నగరం ప్రపంచ సినీ పరిశ్రమకు వేదిక కావాలి అనేది నా సంకల్పం. ఐటీ, ఫార్మా పరిశ్రమలు ఎలాగో.. ఫిల్మ్ ఇండస్ట్రీకి కూడా అంతే. మీరు అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా' అని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు.

**వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు..**

'హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీలో, హైదరాబాద్‌లో.. షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం. సినీ కార్మికుల కోసం ప్రభుత్వం తరపున చేయగలిగిన పనులు చేస్తా. సినీ కార్మికుల కోసం వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నాం. సినీ కార్మికుల వెల్ఫేర్ ఫండ్‌లో ప్రభుత్వ తరపున రూ.10 కోట్లు డిపాజిట్ చేస్తాం. సినిమా టికెట్లు పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో 20 శాతం కార్మికులకు ఇవ్వాలి. కార్మికులకు లాభాల్లో 20 శాతం ఇస్తేనే టికెట్ల ధరలు పెంచుకునేందుకు జీవో ఇస్తాం. సినీ కార్మికుల భవన్ నిర్మాణానికి స్థలం ఇస్తాం. త్వరలోనే సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం. సినీ కార్మికుల అసోషియేషన్‌తో మాట్లాడి స్థలాలు ఇస్తాం. ఫైటర్స్, సినీ కార్మికుల ప్రాక్టీస్‌కు ఫ్యూచర్ సిటీలో ఏర్పాట్లు చేస్తాం. సినీ కార్మికుల సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది. నవంబర్ చివరి వారంలో సినీ కార్మికులతో మాట్లాడతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## లొంగిపోయిన మావోయిస్టు నేతలపై చర్యలు ఉండవు: డీజీపీ శివధర్‌రెడ్డి

**హైదరాబాద్:** పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ ప్రకాశ్‌తో కలిసి మరో కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. మావోయిస్టుల లొంగుబాటు వివరాలను డీజీపీ మీడియా సమావేశంలో వెల్లడించారు. "1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా మారారు. 1981లో పీపుల్స్‌వార్‌లో చేరి.. 1983లో కమాండర్ అయ్యారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారు. 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారు" అని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. "మావోయిస్టు మరో నేత బండ ప్రకాశ్ అలియాస్ ప్రభాత్.. 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశారు. అతని స్వస్థలం తెలంగాణలోని మందమర్రి. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారు. 2004లో జరిగిన శాంతి చర్చల్లో ప్రకాశ్ పాల్గొన్నారు. 2019లో స్టేట్ కమిటీ సభ్యుడయ్యారు. నేషనల్ పార్క్ ఏరియా కీలక ఆర్గనైజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. బండ ప్రకాశ్‌పై ఉన్న రూ.20లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. పుల్లూరి ప్రసాదరావుపై ఉన్న రూ.25లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం.

# రంపచోడవరం ఆసుపత్రి వైద్యులపై జాతీయ ఎస్టి కమిషన్, మహిళ కమిషన్, మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు.

**త్వరలోనే ఏరియా హాస్పిటల్ ముట్టడి**

**ఇప్పటివరకు డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలు మరియు ఆదివాసి ప్రజలు తరలిరావాలి**

**....... కుంజ శ్రీను పిలుపు.**



**సామాన్యుడి అస్త్రం రంపచోడవరం.** రంపచోడవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన బాపనమ్మ మరియు ఆమె బిడ్డ మృతికి కారుకులైనటువంటి రంపచోడవరం ఏరియా ఆసుపత్రి డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ మరియు బాపనమ్మ భర్త కొట్టం రాజన్న దొర ఆధ్వర్యంలో జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ కు, జాతీయ మానవ హక్కుల కమిషన్ కు, మరియు జాతీయ మహిళా కమిషన్ న్యూఢిల్లీ వారికి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో సిబ్బంది, డాక్టర్ల నిర్లక్ష్యం వలనే మాత శిశు మరణాలు వరుసగా సంభవిస్తున్నాయని, ఈ నిర్లక్ష్యంపై డాక్టర్లు తప్పిదంపై అలాగే బాపనమ్మ మృతికి కారుకులైన డాక్టర్లను వైద్యాధికారులను శిక్షించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని. ఇప్పటివరకు ఐటీడీఏ అధికారుల నుండి జిల్లా కలెక్టర్ కు రాష్ట్రస్థాయి అధికారులకు మరియు జాతీయస్థాయిలో ఎస్టీ, మహిళ, హ్యూమన్ రైట్స్ కమిషన్ లకు ఫిర్యాదు చేయడం జరిగిందని. గత శుక్రవారం నాడు శాంతియుత అధికారికి వారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి బాపనమ్మ మరియు తనకు పుట్టిన బిడ్డ మరణానికి కారణాలను వివరించడం జరిగిందని ఆ సమయంలో కొంత సమయం ఇస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు అధికారి తెలియజేసి ఉన్నారని, అలాగే రంపచోడవరం పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని పోలీస్ అధికారులు కూడా ప్రాజెక్టు అధికారి వారి నివేదికను ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలియజేసి ఉన్నారని కావున సంబంధిత అధికారులు వేగవంతంగా విచారణ పూర్తి చేసి సంబంధిత డాక్టర్లపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తుఫాను ప్రభావం తగ్గిన వెంటనే ఇప్పటివరకు రంపచోడవరం ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా మృతిచెందిన వారి కుటుంబాలతో, ప్రజల సహకారంతో కలిసొచ్చే ఆదివాసి సంఘాలు రాజకీయ పార్టీలు అందరితో కలిసి రంపచోడవరం ఏరియా ఆసుపత్రి ముట్టడి కార్యక్రమం చేయబోతున్నట్లు ఆయన తెలియజేశారు. చాలాచోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ప్రజల ప్రాణాలు కాపాడటంలో, సురక్షితమైన ప్రసవాలు చేయటంలో రికార్డులు సృష్టిస్తావుంటే, రంపచోడవరం ఏరియా ఆసుపత్రి మాత్రం ప్రజల్ని చంపడంలో రికార్డు సృష్టిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు రాజమండ్రి మొదలైన ప్రాంతాల నుండి ప్రతిరోజు అప్ అండ్ డౌన్ చేస్తూ సకాలంలో ఆసుపత్రి కి రావడం లేదని, ఎమర్జెన్సీ పరిస్థితిలో, ప్రసవ సమయంలో ఆస్పత్రిలో పనిచేసే వర్కర్లు డ్యూటీ టైం లో ఉండే నర్సులే డాక్టర్లుగా పాత్ర పోషిస్తున్నారని. డాక్టర్లు మాత్రం ఉదయం 11, 12 గంటలకు హాస్పిటల్ కి వచ్చి సాయంత్రం మూడు నాలుగు గంటలకే ఇళ్లకు వెళ్లిపోతున్నారని ఆయన మండిపడ్డారు. సరిగ్గా డ్యూటీ చేయని డాక్టర్లకు జీతాలు ఎందుకు సరిగ్గా ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. డాక్టర్ల వృత్తికి ఉన్న మర్యాదను రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలోని డాక్టర్లు నీరుగారుస్తున్నారు అని ఆయన ఆరోపించారు. ఏజెన్సీలో ఆదివాసి ప్రజలను వైద్యం కోసం వస్తే రంపచోడవరం ఏరియా ఆసుపత్రి డాక్టర్లు అంటరాని వారిగా చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. సరిగ్గా డ్యూటీ చేసే వైద్యులు మాత్రమే ఆసుపత్రిలో ఉంచాలని చుట్టం చూపుగా వచ్చిపోతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వైద్యులను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే ఆసుపత్రి ముట్టడి ప్రజల ప్రయోజనం కోసమేనని ఆయన అన్నారు. ఎన్ని మరణాలు సంభవించిన ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలు నోరు విప్పరనే అలుసు తోటి ఇక్కడ డాక్టర్లు మరియు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని కావున ఇప్పటివరకు ఏరియా ఆసుపత్రి డాక్టర్లు నిర్లక్ష్యం వలన తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులు, ఆదివాసి ప్రజలు, ఆదివాసి సంఘాలు రాజకీయ పార్టీలు కలిసొచ్చి ముట్టడిని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన అధ్యక్షులు మోడీద నూకరాజు, డివిజన్ కోఆర్డినేటర్ పీతా ప్రసాద్, బాపనమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బాలాజీ నగర్ ఎల్లమ్మ గుడిలో కార్తీక దీపోత్సవం

**సామాన్యుడి అస్త్రం జనగామ :** జనగామ జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా కార్తీక దీపాలంకరణను 108 దీపాల అలంకృతితో ఏర్పాటు చేసిన నందీశ్వర శివున్ని భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి దీపాల ఒత్తులు వెలిగించి ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని దర్శించుకుని తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ పూజారి మారుపాక శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ కార్తీక మాసంలో వ్రతం ఆచరించడం వల్ల సకల పాపాలు తొలగిపోయి కుటుంబంలో సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని కార్తీక పురాణ అధ్యాయాలు కథ విన్నా చదివిన విశేషమైన పుణ్యఫలం దక్కుతోందని అన్నారు దేవాలయ ప్రాంగణం హర హర మహాదేవ శంభో శంకర ఓంకార నాదంతో మార్మోగిపోయింది. మట్టి ప్రమిదల్లో భక్తులు దీపాలను వెలిగించి ఆలయ ప్రాంగణంలో తమ భక్తిని చాటుకున్నారు. శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసంలో భక్తులు విశేష పూజలు నిర్వహించడం మన సాంప్రదాయకంగా వస్తుంది. పూజ అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కటాక్షాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజలో కూర్చున్న దంపతులు దూడల రమేష్- శోభారాణి భక్త బృందం లగిశెట్టి పద్మావతి, దూడల నిషిత, తూముకుంట్ల వెంకట నర్సింహారెడ్డి, పెండ్లి సత్తిరెడ్డి, దోసపాటి శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, గట్టు రాధాకృష్ణ, అయిత జయరాములు, లకావత్ స్వామి, అనంతరాములు, రాంచంద్రారెడ్డి, తూముకుంట్ల విజయ, పోగుల కవిత,దోసపాటి శ్రీలక్ష్మి, కన్న జ్యోతి, మాదారపు కల్పన, ఆలేటి పద్మ,సంబోజు జ్యోతి,కందాటి సునీత, గూడేల్లి సంధ్య,బోగ మౌనిక, భాగ్యలక్ష్మి, స్వర్ణలత,నిరోషా తదితరులు పాల్గొన్నారు



# సి యస్ సి హెల్త్ టెస్ట్ లను రద్దు చేయాలి ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనిలకు ఇచ్చిన స్కీమ్స్ ల జీవో 12 ను సవరించాలి

**సామాన్యుడి అస్త్రం జనగామ :** బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలని, భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన జీవో నెం.12ను సవరించాలని,బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం రోజున సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బిల్డింగ్ మదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జనగామ జిల్లా మూడవ మహాసభ జిల్లా అధ్యక్షులు జోగు ప్రకాష్ అధ్యక్షతన జరిగింది. మహాసభల ప్రారంభానికి ముందు బీసీడబ్ల్యూయూ జెండా ను యూనియన్ జిల్లా కార్యదర్శి తాండ్ర ఆనందం ఆవిష్కరించారు. ఈ మహాసభల కు ముఖ్యఅతిథిగా వంగురు రాములు పాల్గొని మాట్లాడుతూ భావన కార్మికుల వెల్ఫేర్ బోర్డు నుండే సంక్షేమ పథకాలు అందించాలని, సహజ మరణాని 5 లక్షలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి 2 లక్షలకు పెంచుతూ, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ నాలుగు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 12ను జూలై 22 న విడుదల చేసింది. జీఓ విడుదల చేసిన రెండు రోజులకే ప్రైవేట్ బీమా కంపెనీలైన క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ. 250 కోట్లు, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.94 కోట్లు, ట్రెయిల్ బ్లైజర్ అనే బ్రోకర్స్ సంస్థ ద్వారా రూ.346 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు అక్రమంగా బదిలీ చేశారు. కేంద్ర చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఇవ్వడం అన్యాయమని 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి వారి నిర్ణయం ప్రకారమే బోర్డు నిధులను ఖర్చు చేయాలిని కానీ వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని ఇప్పటివరకు నియమించకుండా ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారులు ఎలాంటి గుర్తింపు లేని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్కీములను అప్పగించి కార్మికుల నోట్లో మట్టిగొట్టారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2009 నుండి 2025 వరకు బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులు 28, లక్షల మంది ఉండగా, 15 లక్షల మందిని మాత్రమే రెన్యువల్ చేసి ఒక్కొక్క కార్మికుడికి ప్రీమియం రూ.2,309/-ల చొప్పున 15 లక్షల మంది కార్మికులకు రూ.346.36 కోట్లు (ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పనంగా కట్టబెట్టారు. సుమారు 13 లక్షల కార్మికుల కార్డులు రెన్యువల్ చేయకుండా వారికి అన్యాయం చేస్తున్నారని ప్రస్తుతం బోర్డు అమలు చేస్తున్న 12 రకాల స్కీముల్లో 4 మాత్రమే ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చి, మిగతా 8 స్కీములైన వివాహ కానుక, ప్రసూతి కానుక, హాస్పిటల్ ఖర్చులు, దహన సంస్కారాల ఖర్చుల వంటి తదితర స్కీములను ప్రభుత్వం, కార్మికులకు అందకుండా చేస్తున్నది. కార్మికులకు హెల్త్ టెస్ట పేరుతో సిఎస్సి సంస్థకు రూ. 463 కోట్లు దోచి పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా దారి మళ్ళిస్తూ కార్మికులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాలు సకాలంలో ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలి. జీఓ నెం. 12ను సవరించి ఇన్సూరెన్స్ కంపెనీలకు కాకుండా ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి, అక్రమంగా బీమా కంపెనీలకు ఇచ్చిన రూ.346 కోట్లు బోర్డులో జమ చేయాలి, పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ క్కు నిధులు వెంటనే విడుదల చేయాలి, రెన్యువల్ కాని 12 లక్షల మంది కార్మికుల బోర్డు కార్డులను యుద్ధప్రాతిపదికన రెన్యువల్ చేయాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ మహాసభలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శి లు రాపర్తి రాజు,సుంచు విజేందర్ కోశాధికారి అన్నబోయిన రాజు,నాయకులు వెంకటేష్, మల్లేష్ రాజ్,సంపత్,మధు, భిక్షపతి, మహేష్,చంద్రయ్య, అంజయ్య, సుధాకర్, కిష్టయ్య,బాబు,తదితరులు పాల్గొన్నారు






## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలో పాల్గొన్న పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు



**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు జనహృదయనేత, పేద ప్రజల పాలిట ఆశాజ్యోతి, రాజకీయ దురంధరుడు రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మణుగూరు మండలంలోని ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేసి మంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పాయం. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సేవలు మరువలేనివని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే మహా నాయకుడని తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ ప్రజల కష్ట సుఖాలు పాలుపంచుకుంటూ నేనున్నానంటూ ధైర్యం ఇచ్చే ఏకైక నాయకుడు పొంగులేటి అని తెలిపారు. పదవిలో ఉన్న లేకున్నా నిరంతరం పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల గుండెల్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయన ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో ఉండాలని, మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, మరింతగా ప్రజలకు సేవ చేసే భాగ్యం వారికి కల్పించాలని, రాబోవు రోజుల్లో రాజకీయంగా అనేకమైన ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం భారీ బైక్ ర్యాలీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి సురక్ష బస్టాండ్ మీదుగా 100 పడకల హాస్పిటల్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించి 100 పడకల హాస్పిటల్ నందు రోగులకు పళ్ళు, బ్రెడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, కాటబోయిన నాగేశ్వరరావు, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, మహిళా అధ్యక్షురాలు సౌజన్య, పినపాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐతనబోయిన సతీష్ ,టీపీసీసీ మెంబర్ తాళ్లూరి చక్రవర్తి, బూర్గంపాడు మండల నాయకులు ఇంగువ రమేష్, రామి రెడ్డి, గాండ్ల సురేష్, పాల్వంచ రాములు, గుండ గాని నాగేశ్వరరావు , కుర్రం రవి, మైనారిటీ అధ్యక్షుడు రహీం పాషా, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


## కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదు

**నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవు : ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**

**నిషేధిత గంజాయిని రవాణా చేసే వారిపైనే కాదు,గంజాయి సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలి**

**"చైతన్యం-డ్రగ్స్ పై యుద్ధం" కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ రవాణాను అరికట్టడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలి**

**జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**




**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** ఈ రోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తమ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నిషేధిత గంజాయి అక్రమరవాణా, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. చైతన్యం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్), వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్, డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి మరియు జిల్లాలోని సిఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### జలమండలి అధికారులతో ఎమ్మెల్యే గాంధీ సమీక్ష సమావేశం

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


**సామాన్యుడి అస్త్రం, హైదర్‌నగర్:** ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. మంగళవారం హైదర్‌నగర్ జలమండలి కార్యాలయంలో ఆయన జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కాలనీల వాసుల నుండి వచ్చిన వినతి పత్రాలను పరిగణలోకి తీసుకుని అత్యవసర పనులపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమయానుకూలంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ వ్యవస్థలను ఆధునీకరించాలని గాంధీ సూచించారు. ప్రస్తుతం మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, కలుషిత జలాల సరఫరా పూర్తిగా నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. సమీక్షలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, డైరెక్టర్ ఆపరేషన్స్ పీవీ శ్రీధర్, సీజీఎం నారాయణ, జనరల్ మేనేజర్లు కృష్ణ,



శ్రీనివాస్ రెడ్డి, హరిశంకర్, కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, దొడ్ల వెంకటేష్ గౌడ్, జగదీశ్వర్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే డీజీఎంలు నారాయణ, నాగప్రియ, శరత్ రెడ్డి, నరేందర్, మేనేజర్లు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బాలింగ్ గౌతమ్ గౌడ్, మంత్రి ప్రగడ సత్యనారాయణ, ఎండీ ఇబ్రహీం తదితర అధికారులు హాజరయ్యారు.

## బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవదానం : నాలుగురికి కొత్త జీవం

**సామాన్యుడి అస్త్రం, చందానగర్:** మనిషి శరీరం మృతి చెందినా, అతని హృదయం మరో నలుగురి జీవితాల్లో కొట్టుకోవచ్చని నిరూపించారు తెల్లాపూర్‌కు చెందిన ఒక కుటుంబం. రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం చేసిన హృదయవిదారక, హృదయాన్ని తాకే సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీస్ వివరాల ప్రకారం: సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ జేపీ నగర్‌కు చెందిన సామల పాపిరెడ్డి బిహెచ్ఈఎల్ కంపెనీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 25వ తేదీ శనివారం ఉదయం సాధన స్కూల్ మీదుగా కంపెనీకి వెళ్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన అప్పాచ్చి బైక్ (%చీ 07 దీఎ% 5172) ఢీకొట్టింది. ఘటనలో పాపిరెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని సిటిజెన్ హాస్పిటల్‌కు తరలించారు. రెండు రోజులపాటు చికిత్స పొందినప్పటికీ, పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. ఈ సమాచారంతో చందానగర్ పోలీస్‌లు హుటాహుటిన స్పందించారు. ఏఎస్ఐ ఆంజనేయులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.




**అవయవదానం నిర్ణయం...**

**మరో నలుగురికి ప్రాణదానం :** బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించబడిన పాపిరెడ్డి అవయవాలను దానం చేయాలనే మహోన్నత నిర్ణయం కుటుంబ సభ్యులు తీసుకున్నారు. ఆయన హృదయం, కాలేయం, కిడ్నీలు ఇతర రోగులకు దానం చేయగా, వైద్యులు ఆ అవయవాలను సమయానికి అందించి ప్రాణాలను కాపాడారు. "మా కుటుంబం బాధలో ఉన్నా, మరో నలుగురికి జీవం ఇచ్చినందుకు గర్వంగా ఉంది" అని పాపిరెడ్డి భార్య సామల లత చెప్పారు. వైద్యులు, చందానగర్ పోలీసులు, తెల్లాపూర్ ప్రజలు ఈ అవయవదానం నిర్ణయాన్ని ప్రశంసిస్తూ, కుటుంబానికి ధైర్యం చెప్పారు. జీవితాన్ని కోల్పోయిన పాపిరెడ్డి మరణం ఒక కుటుంబాన్ని కన్నీటిలో ముంచగా, అదే సమయంలో మరో నలుగురికి కొత్త ఆశను ఇచ్చింది ం "మరణం ముగింపు కాదు, మరో జీవితానికి ఆరంభం" అని నిరూపించారు ఆయన కుటుంబం.

## హై సెక్యూరిటీ స్మార్ట్ హైవే...

# మీరు ఏఐ నిఘాలో ఉన్నారు

**హైదరాబాద్ :** దేశంలో అత్యంత రద్దీగా ఉండే రహదారుల్లో ఒకటైన హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి త్వరలో 'హై సెక్యూరిటీ స్మార్ట్ హైవే'గా రూపుదిద్దుకోనుంది. ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసల రోడ్డును ఆరు వరుసలుగా విస్తరించడంతోపాటు అత్యంత ఆధునిక సాంకేతికతతో డిజిటల్ రోడ్డుగా మార్చనున్నారు. తెలంగాణ పరిధిలోని మల్కాపూర్ అందోల్ మైసమ్మ ఆలయం వద్ద నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ కనకదుర్గమ్మ గుడి వరకు వరకు దాదాపు 231.32 కిలోమీటర్ల మేర ఈ విస్తరణ జరగనుంది. ఈ భారీ విస్తరణ ప్రాజెక్టు కోసం సుమారు రూ. 10,391.53 కోట్లు నిధులు అవసరమవుతాయని సమగ్ర ప్రాజెక్టు నివేదికలో అంచనా వేశారు. ఇందులో నిర్మాణ వ్యయం కోసం రూ. 6,775.47 కోట్లు, ఇతర అవసరాల కోసం రూ. 3,616.06 కోట్లు కేటాయించారు. డీపీఆర్ రూపకల్పన దాదాపు పూర్తికావడంతో, వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా మే నెలలో పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. రహదారి భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఈ రోడ్డును పూర్తిస్థాయిలో స్మార్ట్ హైవేగా తీర్చిదిద్దనున్నారు. దీనికోసం హైవేపై ప్రతి కిలోమీటర్‌కు రెండు వైపులా ఒకటి చొప్పున మొత్తం 231 అత్యాధునిక 360 డిగ్రీల సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఈ కెమెరాలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అనుసంధానం చేస్తారు. స్పీడ్ డిటెక్షన్, రాంగ్ రూట్ వంటి నిబంధనల అతిక్రమణతో పాటు ప్రమాదాలు వంటివి జరిగితే వెంటనే లొకేషన్, కిలోమీటర్ నంబర్‌తో సహా వీడియో వివరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పంపుతాయి. దీని పర్యవేక్షణకు ప్రత్యేక మానిటరింగ్ కేంద్రాలను హైవేపై ఏర్పాటు చేస్తారు. ఈ వ్యవస్థను రాష్ట్ర పోలీసు, రవాణా శాఖకు అనుసంధానం చేయడం వల్ల రోడ్డుపై నిరంతరం 24 గంటలు నిఘా




ఉంటుంది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్టు గుర్తించిన 38 చోట్ల ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే 17 బ్లాక్‌స్పాట్‌ల వద్ద రోడ్ ఓవర్‌బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. రహదారికి ఇరువైపులా వాహనాలు కిందికి పడిపోకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తారు. సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేయడంతోపాటు, వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. భవిష్యత్తులో రోడ్డును తవ్వకుండా ఉండేందుకు వీలుగా మంచినీటి సరఫరా, గ్యాస్ పైప్‌లైన్లు, ఆప్టికల్ ఫైబర్ కేబుల్ లైన్లు వంటి అన్ని మౌలిక వసతులను నిర్మాణ సమయంలోనే ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్మార్ట్ హైవే విస్తరణ వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలకు గణనీయమైన ఊతమివ్వనుంది. ఈ రహదారి దాదాపు 50 ఇండస్ట్రియల్ పార్కులు, 20 ఎకనామిక్ నోడ్స్, 4 నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ లకు అనుసంధానం కానుంది. ఇది రెండు మేజర్ రైల్వే స్టేషన్లు, రెండు విమానాశ్రయాలకు కూడా అనుసంధానంగా మారనుంది. ప్రస్తుతం ఈ రోడ్డుపై రోజుకు 43,742 వాహనాలు తిరుగుతుండగా.. 2048 నాటికి ఈ సంఖ్య 1,71,251కి పెరుగుతుందని అంచనా. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

# నవీన్ యాదవ్ తండ్రి బైండోవర్

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ బైపోల్ ఎన్నికల్లో రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తండ్రి సహా 100 మందిని బైండోవర్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఇఅఎ) సూచనల మేరకు పోలీసులు ఎన్నికల సమయంలో శాంతి, భద్రతా పరంపరలు కాపాడేందుకు పోలీసులు రౌడీషీటర్ల కదలికలపై కఠిన నిఘా ఉంచుతున్నారు. ఏదైనా కేసు నమోదైతే, వారిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇది ఎన్నికల ప్రక్రియను భద్రంగా నిర్వహించేందుకు తీసుకున్న జాగ్రత్త చర్యల్లో భాగం. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో మొత్తం రౌడీషీటర్లు 100 మందికిపైగానే ఉన్నారు. బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 74 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశారు. మధురానగర్ పోలీస్ స్టేషన్ 19 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశారు. వీరిలో కాంగ్రెస్ అభ్యర్థి తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్, ఆయన సోదరుడు రమేష్ యాదవ్ కూడా ఉన్నారు. ఎన్నికల సమయంలో రౌడీషీటర్లు ఎటువంటి హింసాత్మక చర్యలకు పాల్పడకుండా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. వారి కదలికలపై పూర్తి నిఘా ఉంచామని అని పోలీసు అధికారులు తెలిపారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో పేరు మోసిన రె?డీలు చాలా మంది ఉన్నారు. ఒకప్పుడు రౌడీ రాజ్యం నడిచేది. కాంగ్రెస్ అభ్యర్థి చిన్న నవీన్ యాదవ్ తండ్రి శ్రీశైలం యాదవ్ పై అనేక కేసులు ఉన్నాయి. రెండు, మూడు దశాబ్దాల కిందట.. జూబ్లిహిల్స్ లో ఏం జరిగినా ఆయన కనుసన్నల్లోనే జరగాల్సి ఉండేదని చెబుతారు. సినిమా షూటింగులు కూడా ఆయన అనుమతితోనే జరగాలని లేకపోతే.. అడ్డుకునేవారని అంటారు. అదే సమయంలో ఇతర గ్యాంగుల నుంచి సినిమా వాళ్లకు.. అండగా శ్రీశైలం యాదవ్ ఉండేవారని చెబుతారు. టాలీవుడ్ లో ఉన్న అగ్ర హీరోలందరికీ శ్రీశైలం యాదవ్ తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెబుతారు

## ప్రభుత్వ జూనియర్ కళాశాలో అభివృద్ధి పనుల పరిశీలన

**విద్యార్థుల అవసరాలకు ఉపయోగపడేలా నిధులు వినియోగం కావాలి ఎమ్మార్వో (స్క్రూటినీ అధికారి)సి.హెచ్. శేషగిరిరావు**



**సామాన్యుడు అస్త్రం వైరా:** ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు విద్యార్థుల విద్యా అభివృద్ధికి వినియోగం కావాలని, ఏన్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మార్వో ( స్క్రూటినీ అధికారి)సి.హెచ్. శేషగిరిరావు పరిశీలించారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా మంజూరైన నిధులతో కళాశాలలో జరుగుతున్న ఫ్లోరింగ్, టాయిలెట్ నిర్మాణం తదితర పనులను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. పనులు నాణ్యతతో పాటు సమయానికి పూర్తయ్యేలా పంచాయతీరాజ్ ఎ.ఇ. సూర్యనారాయణకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ ప్రతి అభివృద్ధి పని విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉండాలి. నిధులు సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాచలం, సిబ్బంది మరియు సంబంధిత విభాగాధికారులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ బొబ్బా నవతరెడ్డి

**- నవంబర్ 2న భారీ ఎత్తున బీఆర్ఎస్‌లో చేరిక**



**సామాన్యుడి అస్త్రం, చందానగర్:** చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బా నవతరెడ్డి మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె బీఆర్ఎస్ పార్టీలో బేషరతుగా చేరేందుకు అంగీకారం తెలిపింది. నవతరెడ్డి మాట్లాడుతూ, "నవంబర్ 2వ తేదీ, ఆదివారం ఉదయం 11 గంటలకు నా అనుచరులతో కలిసి భారీ ఎత్తున బీఆర్ఎస్‌లో చేరతాను" అని ప్రకటించారు. పార్టీ బలోపేతం చేయడం, ప్రజలకు మరింత సేవ చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే ఉద్యమ సమయంలో చురుకుగా పనిచేసిన కానీ ఇతర పార్టీల్లో చేరిన కార్యకర్తలు తిరిగి బీఆర్ఎస్ గూటికి రావాలని విజ్ఞప్తి చేశారు. "శేరిలింగంపల్లిలో మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగరేయడం మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో సీనియర్ నాయకులు బొబ్బా విజయరెడ్డి, ఇతర స్థానిక నేతలు కూడా ఉన్నారు.

## రేవంత్ సూచనలతో లొంగొపోయాము

## అజ్ఞాతం వీడిన చంద్రన్నా, బండి ప్రకాశ

**హైదరాబాద్ :** తెలంగాణ డీజీపీ ముందు మావోయిస్టు కీలక నేతలుప్రసాదరావు అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్ సరెండర్ అయ్యారు. మావోయిస్టు లొంగుబాటులో తెలంగాణ నాఎః కీలక ఆపరేషన్ నిర్వహిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు చంద్రన్న అజ్ఞాతం వీడారు. జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారు. చంద్రన్న కేంద్ర కమిటీలో కీలక సభ్యుడిగా పనిచేశారు. అనారోగ్య పరిస్థితులు.. ఆపరేషన్ కగార్ వల్ల తాము లొంగిపోయామని మావోయిస్టులు చెప్పారు. రేవంత్ సూచనాలతోనే జనజీవన స్రవంతిలోకి వస్తున్నామన్నారు. అయితే ఇది లొంగుబాటు కాదు.. రాబోయే రోజుల్లో ప్రజల కోసమే వస్తున్నామని స్పష్టం చేశారు. తాము ఎలాంటి డబ్బులు ఆశించడం లేదన్నారు. చాలా మంది చనిపోయారు.. మా సిద్ధాంతం మేరకు ముందుకెళుతున్నామని చెప్పుకొచ్చారు. మావోయిస్టు పార్టీలో అంతర్గత చీలికలు జరిగాయని సరెండర్ నక్సలైట్లు తెలిపారు. దేవోజి సీపీఐ మావోయిస్టు కార్యదర్శిగా ఉన్నారు.. ఎవరి మార్గం వాళ్ళు ఎంచుకున్నారు.. మేము ఎంచుకున్నామని బండి ప్రకాష్, చంద్రన్న తెలిపారు. సోని వర్గం మమ్మల్ని వ్యతిరేకేస్తోందని.. మాకు కూడ ప్రజాల మధ్య పనిచేసే క్యాడర్ ఉంది.. దేశమంతా పనిచెయ్యడానికి ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఉద్యమంలో పీడిత ప్రజల కోసమే పని చేశామని , భవిష్యత్తులో కూడా ప్రజల కోసమే పని చేస్తామని తెలిపారు. మా సిద్ధాంతం ఓడిపోలేదు, ఓడించడం ఎవరితరం కాదని వారు తెలిపారు. మా భావాజాలంతో భవిష్యత్తులో మరింత మంది ముందుకు వచ్చే అవకాశం ఉందని.. ప్రజల మధ్య ఉండి సేవ చేయాలనుకున్నా మన్నారు. ఆయుధాలను పార్టీకి ఇచ్చి వచ్చామని తెలిపారు. చంద్రన్నా, బండి ప్రకాశ్ అజ్ఞాతం వీడారని.. తెలంగాణ ప్రభుత్వం పిలుపు మేరకు అజ్ఞాతం నుండి బయటికి వచ్చి జనజీవన స్రవంతి లో కలిశారని డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు. పుల్లూరి ప్రసాద్ రావ్ ఏ చంద్రన్నా ది పెద్దపల్లి మండలం , 15 ఏళ్ల కేంద్ర కమిటీ సభ్యుడి గా ఉన్నాడు. మొదట రాడికల్ స్టూడెంట్ గా తన ప్రస్థానాన్ని స్టార్ట్ చేశాడు . 1980 లో కిషన్ జీ కి కొరియర్ గా చేశాడు. 2008 లోనే కేంద్ర కమిటీ మెంబర్ గా చంద్రన్న ఉన్నాడు. 2024 డిసెంబర్ వరకు తెలంగాణ స్టేట్ కమిటీ సెక్రటరీ గా ఉన్నాడని డీజీపీ తెలిపారు. అక్టోబర్ 21 నాడు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చంద్రన్న జన జీవన స్రవంతి

# ఎండుద్రాక్షలో కూడా కల్తీనా?



పండుగల సమయంలో, మనం నైవేద్యం పెట్టడానికి, స్వీట్లు తయారు చేయడానికి, పాయసాల్లో కలపడానికి ఎండుద్రాక్షలను కొనుగోలు చేస్తాము. అందుకే ఇటీవల ఎండుద్రాక్షలో నకిలీ పండ్లు అమ్ముడయ్యాయి . గుడ్లు, పనీర్ మొదలైన వాటిలో నకిలీల గురించి మనం ఇటీవల చాలా విన్నాము. కానీ ఇప్పుడు ఎండుద్రాక్ష విషయంలో కూడా ఇది జరిగింది. దానిని ఎలా గుర్తించాలో ఇక్కడ మనం చూడబోతున్నాం. ఎండుద్రాక్షలను ఎలా తయారు చేస్తారు?: చాలా మందికి ఎండుద్రాక్ష దేనితో తయారు చేస్తారో తెలియదు. దీన్ని తయారు చేయడం చాలా చాలా సులభం. తాజా ద్రాక్షను ఆవిరి మీద ఉడికించి ఎండలో ఆరబెట్టి ఎండబెట్టి ఎండబెట్టడం వల్ల ఎండుద్రాక్ష లభిస్తుంది. కొంతమంది ఆమ్లత్వం ఎక్కువగా ఉన్న పండ్లకు చక్కెర సిరప్ కలుపుతారు. ఇటీవల, మార్కెట్లలో నకిలీ ఎండుద్రాక్షలు కూడా అమ్ముడవుతున్నాయి. నకిలీ ఎండుద్రాక్షలు: ప్రతిరోజూ రాత్రి 10 ఎండు ద్రాక్షలను నీటిలో నానబెట్టి, ఆ నీటితో కలిపి తింటే, మీ శరీరంలో అనేక ఆరోగ్య మార్పులు కనిపిస్తాయని వైద్యులు, పోషకాహార నిపుణులు సలహా ఇస్తున్నారు . ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ, దుకాణాల్లో ఎండు ద్రాక్షను కొని తినడం ఇప్పటికీ కష్టం. అంతేకాకుండా, వాటిలో చాలా వరకు ఇప్పుడు కల్తీగా అమ్ముడవుతున్నాయి.

స్వరూపం, రంగు: ద్రాక్షను ఆవిరి మీద ఉడికించి ఎండబెట్టినప్పుడు, వాటి రంగు సహజంగానే కొద్దిగా నిస్తేజంగా ఉంటుంది. అది నకిలీదైతే, దానికి రంగు వేయబడి ఉంటుంది. అది ప్రకాశవంతంగా, మెరుస్తూ కనిపిస్తుంది. సహజంగా ఎండిన ద్రాక్ష తొక్క ముడతలు పడుతుంది. అది కృత్రిమంగా ఉంటే, తొక్క ముడతలు లేకుండా ఉంటుంది. అది పరిమాణంలో, రూపంలో ఒకేలా ఉంటే, అది అసలైనది. అది పరిమాణంలో భిన్నంగా ఉంటే, దానిలో చాలా కల్తీ ఉందని అర్థం. రుచి ఎలా ఉంటుంది?: అసలు ఎండుద్రాక్షలు కొద్దిగా తీపి, కొద్దిగా పుల్లని రుచిని కలిగి ఉంటాయి. అవి అసలైనవి, బాగా ఎంచుకున్న పండ్ల నుండి తయారు చేయబడతాయి. అవి పుల్లగా లేకపోత, తీపి రుచిని కలిగి ఉంటే, వాటిని చక్కెర సిరప్‌లో నానబెట్టి ఎండబెట్టి ఉండవచ్చు. అవి చాలా తీపిగా రుచి చూస్తాయి. ఇది మంచిది కాదు. నకిలీ ఎండుద్రాక్ష తినడం వల్ల కలిగే ప్రమాదాలు: వాటిని ఎండలో సరిగ్గా ఎండబెట్టకపోతే, అవి ఫంగల్ ఇన్ఫెక్షన్లను అభివృద్ధి చేస్తాయి. ఇది కడుపు నొప్పి, విరేచనాలు వంటి సమస్యలను కలిగిస్తాయి. ఏదైనా రసాయనాలు లేదా రంగులు కలిపితే, అవి జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తాయి. కడుపు నొప్పి, వాంతులు, వికారం వంటి సమస్యలను కలిగిస్తాయి. నకిలీ ఎండిన ద్రాక్షకు జోడించిన కొన్ని రసాయనాలు క్యాన్సర్‌కు కూడా కారణమవుతాయి.

## ఈ అలవాట్లను మానుకోండి! లేదంటే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



ప్రతి ఒక్కరి జీవితంలో ఉదయం వేళ తీసుకునే నిర్ణయాలు, అలవాట్లు చాలా కీలకంగా మారుతాయి. ఆరోగ్యకరమైన రోజుకు పునాది వేసే శక్తి ఉదయపు దినచర్యకు ఉంటుంది. అందుకే ఆరోగ్య నిపుణులు ఎల్లప్పుడూ మంచి మార్నింగ్ రొటీన్‌ను పాటించాలని సూచిస్తుంటారు. అయినప్పటికీ, చాలా మంది తెలియకుండానే తమ ఆరోగ్యాన్ని దెబ్బతీసే అనారోగ్యకరమైన అలవాట్లలో కూరుకుపోతున్నారు. ఈ అలవాట్లు అప్పటికి కొంచెం ఉపశమనం లేదా తక్షణ సంతృప్తిని ఇచ్చినప్పటికీ, దీర్ఘకాలంలో మన శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. నిపుణుల హెచ్చరికల ప్రకారం, చాలా మంది ఉదయం లేవగానే చేసే అలవాట్లలో ముఖ్యమైనవి మొబైల్ ఫోన్ చూడటం, వెంటనే టీ లేదా కాఫీ తాగడం, అల్పాహారం మానేయడం వంటివి. ఉదాహరణకు, నిద్ర లేవగానే ఫోన్ చూడటం వలన మెదడుపై అనవసరమైన ఒత్తిడి పెరిగి, మానసిక ప్రశాంతత దెబ్బతింటుంది. అలాగే, ఖాళీ కడుపుతో కాఫీ తాగడం వలన శరీరంలోని సహజ కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్) ఉత్పత్తికి ఆటంకం కలిగి, ఆందోళన పెరిగే అవకాశం ఉంది. ఈ అలవాట్లు అప్పటికప్పుడు మనకు పెద్ద సమస్యగా అనిపించకపోవచ్చు, కానీ క్రమంగా జీవక్రియ మందగించడం, ఒత్తిడి హార్మోన్ల సమతుల్యత దెబ్బతినడం, గుండె సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఆరోగ్యాన్ని క్రమంగా పాడుచేసే అలాంటి 5 అనారోగ్యకరమైన అలవాట్లను వెంటనే మానుకోవాలని నిపుణులు గట్టిగా సూచిస్తున్నారు. వాటిలో ముఖ్యమైనవి: ఉదయం లేవగానే మొబైల్ చూడటం, వెంటనే కెఫీన్ తీసుకోవడం (టీ/కాఫీ), అల్పాహారం మానేయడం, ఉదయం నీళ్లు తాగకుండా ఉండటం, ఇంకా అలారం 'స్నూజ్' చేయడం. ముఖ్యంగా అల్పాహారం మానేయడం వలన శరీరానికి తగిన పోషకాలు అందక, రోజంతా శక్తి స్థాయిలు తగ్గిపోతాయి. దీని వలన తరువాత అతిగా తినే అలవాటు పెరిగి, బరువు పెరగడానికి, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడానికి దారితీస్తుంది. ఈ అనారోగ్యకరమైన అలవాట్ల నుండి బయటపడాలంటే, ఉదయపు దినచర్యలో చిన్నపాటి మార్పులు చేసుకోవడం చాలా ముఖ్యం. ఉదాహరణకు, నిద్ర లేచిన వెంటనే ముందుగా ఒక గ్లాసు నీరు తాగడం ద్వారా రాత్రి పూట కోల్పోయిన నీటిని తిరిగి అందించవచ్చు. ఆ తరువాత కొంత సమయం పాటు మొబైల్‌ను పక్కన పెట్టి, ధ్యానం లేదా చిన్నపాటి వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలి. అలాగే, పోషకాలు సమృద్ధిగా ఉన్న అల్పాహారాన్ని (ప్రోటీన్, ఫైబర్ కలిగిన ఆహారం) తీసుకోవడం ద్వారా జీవక్రియను మెరుగుపరచి, రోజు మొత్తానికి సరిపడా శక్తిని పొందవచ్చు. ఈ చిన్న మార్పులు మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి, మానసిక ప్రశాంతతను పెంచుతాయి మరియు మీ రోజును సానుకూల దృక్పథంతో ప్రారంభించడానికి

## అన్నం మానేస్తే శరీరంలో జరిగే మార్పు




అన్నం లేకుండా రోజు గడవని వారు మనలో చాలా మంది ఉన్నారు. బియ్యం లేకుండా భోజనం అసంపూర్ణంగా భావిస్తారు. అయితే ఆరోగ్య కారణాల వల్ల చాలా మంది అన్నం తినడం మానేయాలని చూస్తుంటారు. ఆకలి, చిరాకు: అన్నం మన శరీరానికి తక్షణ శక్తిని అందించే ఒక ప్రధాన వనరు. మీరు అకస్మాత్తుగా అన్నం తినడం మానేస్తే మీ శరీరం ఈ మార్పుకు అలవాటు పడటానికి కొంత సమయం పడుతుంది. మొదటి కొన్ని రోజులు మీకు ఎక్కువ ఆకలిగా, బలహీనంగా లేదా కొద్దిగా చిరాకుగా అనిపించవచ్చు. అందుకే అన్నంకు బదులుగా మీ ఆహారంలో మిల్లెట్, బార్లీ, క్వినోవా లేదా కాయధాన్యాలు వంటి ఇతర ధాన్యాలను చేర్చుకోవడం ముఖ్యం. బరువు తగ్గడం: బియ్యంలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. సులభంగా జీర్ణమవుతాయి. మీరు అన్నం తినడం మానేస్తే, మీ శరీరానికి అందే కేలరీలు తగ్గుతాయి. ఫలితంగా.. బరువు తగ్గడానికి ఇది దారితీస్తుంది. బరువు తగ్గాలనుకునే వారు చాలా వరకు అన్నం తీసుకోవడం తగ్గిస్తారు. రక్తంలో చక్కెర స్థాయిలు: తెల్ల బియ్యం త్వరగా జీర్ణమవుతుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. ఒక నెల పాటు అన్నం మానేయడం వల్ల మీ రక్తంలో చక్కెర స్థాయిలు మరింత స్థిరంగా ఉండే అవకాశం ఉంది. ఇది మధుమేహం ఉన్నవారికి చాలా ప్రయోజనకరం. జీర్ణక్రియలో మార్పులు: కొంతమందికి అన్నం తినడం వల్ల కడుపు ఉబ్బరం లేదా మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. అయితే మీరు అన్నం తినడం మానేసినప్పుడు, మొదట్లో స్వల్పంగా కడుపు నొప్పి లేదా మలబద్ధకం అనిపించవచ్చు. కానీ మీరు పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు ఎక్కువగా తీసుకుంటే మీ జీర్ణక్రియ త్వరగా మెరుగుపడుతుంది. పోషకాహార లోపాల ప్రమాదం: బియ్యంలో విటమిన్ బి ఉంటుంది. ఇది శరీరానికి శక్తిని ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. దీర్ఘకాలంగా బియ్యం మానేస్తే ఈ విటమిన్ లోపం ఏర్పడవచ్చు. ఇది అలసట, మానసిక స్థితిలో మార్పులు లేదా వింత ఆహార కోరికలకు దారితీస్తుంది. మీరు బియ్యం తినడం మానేసినప్పుడు, విటమిన్ బి తో పాటు ఇతర అవసరమైన పోషకాలు మీ శరీరానికి అందేలా ఆకుకూరలు, పప్పుధాన్యాలు, గుడ్లు, పాలు వంటి ప్రత్యామ్నాయ ఆహారాలను మీ డైట్‌లో తప్పక చేర్చుకోవాలి.

## రాత్రిపూట ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త..



శీతాకాలంలో కొంతమందికి రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండటం సహజం.. ఇది సరైన ఆహారం తీసుకోకపోవడం, వ్యాయామం లేకపోవడం వల్ల కావచ్చు. అయితే.. డయాబెటిక్ రోగులు ఎలాంటి దినచర్యను అనుసరించాలో తెలుసుకోవడం ముఖ్యం.. ఇప్పుడు శీతాకాలం సమీపిస్తున్నందున, ప్రజల ఆహారపు అలవాట్లు కూడా మారుతాయి.. ఇలాంటి తరుణంలో జాగ్రత్త ఉండటం ముఖ్యమని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇప్పుడు శీతాకాలం సమీపిస్తున్నందున, ప్రజల ఆహారపు అలవాట్లు కూడా మారుతాయి.. ఇలాంటి పరిస్థితుల్లో కొంతమందికి రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే ప్రమాదం ఉంది. ఉష్ణోగ్రత తగ్గడం వల్ల శరీర జీవక్రియ రేటు మందగిస్తుందని వైద్యులు అంటున్నారు. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. ఈ సమయంలో ప్రజలు తక్కువ వ్యాయామం చేస్తారు. అలాగే.. వారు చలిలో బయటకు వెళ్లరు.. దీనివల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అమాంతం పెరిగే ప్రమాదం పెరుగుతుంది. శీతాకాలంలో, ఇన్సులిన్ అవసరాలు, శరీర ప్రతిస్పందన మారుతుంది.. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కాబట్టి కొన్ని విషయాలను గుర్తుంచుకోవడం ముఖ్యం అని వైద్యులు అంటున్నారు. ఇప్పుడు, శీతాకాలంలో చక్కెర స్థాయిలు పెరిగే ప్రమాదం ఉందని, నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. కాబట్టి, ఈ సమయంలో మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యంగా తక్కువ కార్బ్ ఆహారం తీసుకోవాలి.. పండ్లు – ఆకుపచ్చ కూరగాయలు పుష్కలంగా తినాలి.. అధిక స్వీట్లు లేదా వేయించిన ఆహారాలకు దూరంగా ఉండండి. అలాగే, ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయండి.దీనితో పాటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ చక్కెర స్థాయిలను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవడం మంచిది. మీ చక్కెర స్థాయి ఎక్కువగా ఉంటే, వైద్యుడిని సంప్రదించండి. దానిని నిర్లక్ష్యం చేయవద్దు. ఇది కొన్నిసార్లు ప్రమాదకరం కావచ్చు. ఒక వ్యక్తికి తరచుగా మూత్ర విసర్జన, అధిక దాహం, ఆకస్మిక బరువు తగ్గడం లేదా పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తే, ఇవి చక్కెర స్థాయి ఎక్కువగా ఉందని సూచించే సంకేతాలు కావచ్చు అని వైద్యులు అంటున్నారు.

## గుడ్డు ఇలా తిన్నారంటే కొంప కొల్లేరే!



ఆరోగ్యానికి గుడ్లు ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో విటమిన్లు ఎ, బి, బి12, డి, ఇ పుష్కలంగా ఉంటాయి. అందుకే వైద్యులు గుడ్లు తినమని ఎల్లప్పుడూ సలహా ఇస్తుంటారు. చిన్న పిల్లలు కూడా గుడ్లు తినడానికి ఇష్టపడతారు. కానీ గుడ్లు తినే విధానంపై దాని ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయి. పచ్చిగా లేదంటే సగం ఉడికించిన గుడ్లు తినడం మానుకోవాలి. అలాంటి గుడ్లలో సాల్మొనెల్లా వంటి సూక్ష్మక్రిములు ఉంటాయి. ఇవి ఫుడ్ పాయిజనింగ్‌కు కారణమవుతాయి. గుడ్డులోని తెల్లసొన, పచ్చసొన రెండింటినీ పూర్తిగా ఉడికించాలి. గుడ్లను ఉత్తమ అల్పాహార ఆహారంగా పరిగణిస్తారు. ఉదయం గుడ్లు తినడం వల్ల రోజంతటికి కావల్సిన శక్తి లభిస్తుంది. పైగా కడుపు ఎక్కువసేపు నిండుగా ఉంటుంది. అయితే రాత్రి పడుకునే ముందు గుడ్లు తినడం వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. గుడ్లను వేయించడానికి బదులుగా తక్కువ నూనెలో ఉడికించాలి. గుడ్లను వెన్నలో డీప్ ఫ్రై చేయడం లేదా ఉడికించడం వల్ల కొవ్వు పెరుగుతుంది. నూనెతో చేసిన గుడ్లు, వేయించిన గుడ్లు ఆరోగ్యానికి హానికరం. ఆవిరితో ఉడికించిన ఆమ్లెట్‌లు ఆరోగ్యకరమైన ఎంపికలు. వీటిని నీళ్లలో పూర్తిగా ఉడికించి తినడం ఇంకా మంచిది. గుడ్డులోని తెల్లసొన ఎక్కువ మొత్తంలో తినడం కూడా అంత మంచిది కాదు. రోజుకు 1-2 గుడ్డులోని తెల్లసొన తినడం సురక్షితం. అధిక కొలెస్ట్రాల్ లేదా గుండె జబ్బుల ప్రమాదం ఉన్న మహిళలు గుడ్డులోని తెల్లసొనను తక్కువగా తినాలి. తాజా గుడ్లు మరింత పోషకమైనవి, సురక్షితమైనవి. కూరగాయలు లేదా ధాన్యాలతో కలిపి గుడ్లు తినవచ్చు. గుడ్లు మాత్రమే తినడం వల్ల తక్కువ ఫైబర్ లభిస్తుంది. పాలకూర, టమోటాలు, ఉల్లిపాయలు, చపాతీలతో వీటిని తినడం వల్ల సమతుల్య ఆహారం లభిస్తుంది. ప్రోటీన్లను జీర్ణం చేయడానికి శరీరానికి నీరు చాలా అవసరం.





# రవితేజ, నవీన్ పొలిశెట్టి కాంబోలో సినిమా

మాస్ జాతర సినిమాతో మూవీ లవర్స్‌కు పక్కా వినోదాన్ని అందించేందుకు రెడీ అవుతున్నాడు టాలీవుడ్ యాక్టర్ రవితేజ. శుక్రవారం మాస్ జాతర పెయిడ్ ప్రీమియర్ వేయనున్నారు. ఈ చిత్రంతోపాటు కిశోర్ తిరుమల దర్శకత్వంలో కూడా ఆర్‌టీ 76 ప్రాజెక్టును చేస్తున్నాడు. ఈ మూవీ 2026 సంక్రాంతి రిలీజ్‌కు రెడీ అవుతుంది. కాగా ఈ రెండు సినిమాలు విడుదల కాకముందే రవితేజ కొత్త మూవీకి సంబంధించిన ఆసక్తికర వార్త ఫిలింనగర్‌లో రౌండప్ చేస్తోంది. జాతి రత్నాలు, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ సినిమాలతో సూపర్ ఫేం సంపాదించాడు యంగ్ యాక్టర్ నవీన్ పొలిశెట్టి. ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తోన్న అనగనగా ఒక రోజు 2026 సంక్రాంతికి విడుదల కానుంది. కాగా ఈ ఇద్దరు సంక్రాంతి హీరోలు కలిసి ఓ సినిమా చేయబోతున్నారట. ధమాకా రైటర్ ప్రసన్నకుమార్ బెజవాడ రవితేజ, నవీన్ పొలిశెట్టి కోసం ఓ కథను సిద్ధం చేసి వారికి వినిపించగా.. ఇద్దరూ స్క్రిప్ట్‌కు బాగా కనెక్ట్ అయ్యారని ఇన్‌సైడ్ టాక్. ఎక్కడికి పోతావు చిన్నవాడా, నా సామి రంగా, నేను లోకల్, దాస్ కా ధమ్‌కీతోపాటు పలు చిత్రాలకు డైలాగ్స్ అందించాడు ప్రసన్న కుమార్ బెజవాడ. రవితేజ, నవీన్ పొలిశెట్టిలో కామిక్ టైమింగ్ విషయానికొస్తే ఎవరి స్టైల్ వారిదే. మరి అంతా అనుకున్నట్టు కుదిరితే రవితేజ, నవీన్ పొలిశెట్టి కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేయడం పక్కా అని చెప్పొచ్చు. మరి ఈ క్రేజీ కాంబోపై రానున్న రోజుల్లో అధికారిక ప్రకటన ఏమైనా వస్తుందనేది చూడాలి. మరి ఈ ఇద్దరిని డైరెక్ట్ చేసేది ఎవరనేది ఆసక్తికరంగా మారింది.

## దాదాసాహెబ్ ఫాల్కే సలహా బోర్డ్ సభ్యురాలిగా సుధారెడ్డి



దాదా సాహెబ్ ఫాల్కే అంతర్జాతీయ చలనచిత్రోత్సవం సలహా బోర్డ్ సభ్యురాలిగా ప్రముఖ వ్యాపారవేత్త, సాంస్కృతిక రాయబారి సుధారెడ్డిని నియమితులయ్యారు. ఈమె కాకుండా బోర్డ్‌లో హిందూజా గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ కల్నల్ పి.సి. సూద్, బరోడా మహారాణి హెచ్.హెచ్. రాధికరాజే గైక్వాడ్, వి.ఎం. సల్గావ్కార్ కార్పొరేషన్ చైర్మన్ దత్తరాజ్ సల్గావ్కార్, ఇండియన్ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా, ఇండియన్ కొరియోగ్రాఫర్ షియామక్ దావర్, దాదాసాహెబ్ ఫాల్కే ముని మనవరాలు గిరిజా ఫాల్కే మరాతే, ఇన్ఫర్మేషన్ %డ% బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖలో గౌరవనీయ సాంస్కృతిక నిపుణుడు %డ% మాజీ సెన్సార్ బోర్డు జ్యూరీ భావనా మర్చంట్, సినీపోలిస్ ఇండియా ఫిల్మ్ ప్రోగ్రామింగ్ %డ%డిస్ట్రిబ్యూషన్ హెడ్ మయాంక్ ష్రాఫ్ మరియు భారత ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ %డ% బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖలో క్రియేటివ్ ప్రొడ్యూసర్ %డ% మాజీ సెన్సార్ బోర్డు జ్యూరీ జ్యోతి బధేకా తదితరులు ఉన్నారు. భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే వారసత్వంలో డీపీఐఎఫ్‌ఎఫ్ సలహా బోర్డ్.. సాంస్కృతిక ప్రతిష్టకు నిలయంగా ఉద్భవించింది. కళాకారులు, చిత్రనిర్మాతలు, పరిశ్రమ నాయకులను నిరంతరం గౌరవిస్తూనే సినిమా రంగంలో ప్రపంచ కేంద్రంగా భారతదేశం యొక్క స్థాయిని బలోపేతం చేస్తుంది. ఇకపోతే అక్టోబరు 29-30వ తేదీల్లో ముంబై వేదికగా దాదాసాహెబ్ ఫాల్కే అంతర్జాతీయ చలనచిత్రోత్సవ అవార్డులు-2025 కార్యక్రమం జరగనుంది.

## 10 రోజుల్లో రూ. 55 కోట్లు.. బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న ధ్రువ్ విక్రమ్ 'బైసన్'




తమిళ అగ్ర నటుడు విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్ ప్రధాన పాత్రలో నటించిన 'బైసన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఈ చిత్రం విడుదలైన 10 రోజుల్లోనే రూ.55 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్ తెలుపుతూ.. బైసన్ రన్ ఇంకా కొనసాగుతుంది. మీ అందరి ప్రేమకు ధన్యవాదాలు అంటూ రాసుకొచ్చాడు. ఈ సినిమాకు పాజిటివ్ టాక్ రావడంతో రెండో వారంలో ఈ చిత్రానికి భారీగా స్క్రీన్స్ పెరిగాయి. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, కేరళలో థియేటర్‌లు పెరగడంతో మంచి కలెక్షన్లు రాబడుతుంది ఈ చిత్రం. ధ్రువ్ విక్రమ్, అనుపమా పరమేశ్వరన్ జోడీగా నటించిన ఈ సినిమాకు మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమాను పా.రంజిత్ నీలం ప్రొడక్షన్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్, శాంతి సినిమాస్ బ్యానర్‌లు సంయుక్తంగా నిర్మించాయి. పశుపతి, రజిషా విజయన్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటించారు.

# రేపటి నుంచే సెమీస్ యుద్ధం.. కొత్త ఛాంపియన్ అవతరించేనా?

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో కీలక మ్యాచ్‌లకు రేపటితో తెరలేవనుంది. లీగ్ దశలో అదరగొట్టిన నాలుగు జట్లు ఇప్పుడు సెమీఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లు ఇప్పటికే మాజీ ఛాంపియన్లుకాగా .. భారత్, దక్షిణాఫ్రికా తొలి కప్ కోసం చకోర పక్షుల్లా నిరీక్షిస్తున్నాయి. నాకౌట్ దశలో తిరుగులేని ఆసీస్, ఇంగ్లీష్ జట్లకు చెక్ పెడితే తప్ప కొత్త విజేతను చూడలేం. అన్ని విభాగాల్లో దుర్భేద్యంగా ఉన్న ఈ రెండు జట్లకు టీమిండియా, సఫారీ టీమ్‌లు మట్టికరిపించాలంటే సర్వశక్తులు ఒడ్డాల్సిందే. ఒకరిద్దరి మీద ఆధారపడకుండా సమిష్టిగా రాణించడం తప్ప మరో దారి లేదు. వరల్డ్ కప్ అంటే చాలు.. ఆస్ట్రేలియా జట్టు ట్రోఫీని తన్నుకపోవడం పరిపాటి అయింది. పురుషుల జట్టు మాత్రమే కాదు ఆ దేశపు ఆడ సింహాలు కూడా రికార్డు స్థాయిలో కప్‌ను తన్నుకుపో యాయి. ఎక్కడ టోర్నీ జరిగినా విజేతలం మేమే అన్నట్టుగా ఆసీస్ (1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022, ) ఎనిమిదిసార్లు, ఇంగ్లండ్ జట్టు (1973, 1993, 2009, 2017) నాలుగుసార్లు ఛాంపియన్లు అయ్యాయి. ఈ రెండు జట్లను కాదని ఒకేఒకసారి 2000 సంవత్సరంలో న్యూజిలాండ్ విశ్వవిజేతగా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు పదమూడో సీజన్‌లోనూ అలీసా హేలీ సారథ్యంలోని కంగారూ టీమ్‌అజేయంగా సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లి తొమ్మిదోసారి విజేతగా నిలవాలనే కసితో ఉంది. మరోవైపు చివరి లీగ్ మ్యాచ్‌లో ఓటమి మినహా ఛాంపియన్ ఆటతో ఇంగ్లండ్ సెమీస్ బెర్తు దక్కించుకుంది. బ్యాటింగ్‌లో కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్, హీథర్ నైట్, అమీ జోన్స్ రాణిస్తుండగా.. స్పిన్నర్లు లిన్సే స్మిత్, డీన్స్, ఎకిల్‌స్టోన్ ఆ జట్టు విజయాల్లో కీలకం అవుతున్నారు. సెమీస్‌లోనూ విజయంతో ఐదో కప్ వేటకు మరింత చేరువవ్వాలనే పట్టుదలతో ఉంది ఇంగ్లండ్. ఇక.. దక్షిణాఫ్రికా కథ వేరు. ఆరంభ పోరులోనే ఇంగ్లండ్ బౌలర్లను ఎదుర్కోలేక 69 పరుగులకే ఆలౌటయ్యింది సఫారీ టీమ్. అయితే.. మ్యాచ్ అనంతరం 'మేము 69 ఆలౌట్ కన్నా ఎంతో మెరుగైనవాళ్లం' అని చెప్పిన కెప్టెన్ లారా వొల్వార్డ్ ఊహించని విధంగా జట్టును సెమీస్ చేర్చింది. మిడిలార్డర్లలో చోలే ట్రయాన్, మరినే కాప్.. ఫినిషర్ డీక్లెర్క్ తుఫాన్ ఇన్నింగ్స్‌లకు తోడు.. స్పిన్నర్ మ్లాబా జోరుతో వరుసగా ఐదు విజయాలతో దర్జాగా నాకౌట్ పోరుకు అర్హత సాధించింది.

**97 పరుగులకే కుప్పకూలి**




చివరి లీగ్ మ్యాచ్‌లోనూ విజయంతో సెమీస్‌కు ఆత్మవిశ్వాసం కూడకట్టుకోవాలనుకున్న సఫారీల కథ ఆస్ట్రేలియాపై ఓటమితో మళ్లీ మొదటికి వచ్చింది. విశాఖపట్టణంలో భారత జట్టుపై 3 వికెట్ల తేడాతో గెలుపొందిన లారా బృందం అదే వేదికపై ఒత్తిడికి తలొగ్గింది. ఆసీస్ లెగ్ స్పిన్నర్ అలనా కింగ్(7-218) ధాటికి 97 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయం మూటగట్టుకుంది. మరి.. సెమీస్‌లో ఇంగ్లండ్‌కు షాకిచ్చి తొలి మ్యాచ్ ఓటమికి ప్రతీకారం తీర్చుకుంటుందా? లేదా? అనేది రేపటితో తెలిసిపోనుంది. నిరుడు టీ20 వరల్డ్ కప్ ఆసాంతం దుమ్మురేపిన లరా బృందం.. చివరకు ఫైనల్లో మాత్రం కుదేలైంది. తొలిసారి పొట్టి ప్రపంచ కప్ ఛాంపియన్ అయ్యే అవకాశాన్ని చేజార్చుకుంది. అమేలియా కేర్ ఆల్‌రౌండ్ షోతో విజేతగా అవతరించిన న్యూజిలాండ్ తొలి కప్ కలను సాకారం చేసుకుంది.

**ఓపెనర్లే బలం..**

వన్డే ప్రపంచ కప్ చరిత్రలో రెండుసార్లు ఫైనల్ చేరిన భారత జట్టు.. ఆఖరి మెట్టుపై తడబడింది. మొదటిసారిగా 2005లో మిథాలీ రాజ్ సారథ్యంలో టీమిండియా టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. కానీ ఆస్ట్రేలియా ధాటికి రన్నరప్‌గానే సరిపెట్టుకుంది. అనంతరం 2017లో ఫైనల్ చేరినా.. ఇంగ్లండ్‌ను నిలువరించలేక తొలిసారి కప్‌ను ఒడిసిపట్టే అవకాశం చేజార్చుకుంది. ఈసారి.. పుష్కర కాలం తర్వాత వరల్డ్ కప్ పోటీలకు ఆతిథ్యమిచ్చిన భారత్ అతికష్టంతో సెమీస్ బెర్తు ఖాయం చేసుకోగా.. వరుణుడి దెబ్బకు శ్రీలంక ఆశలు ఆవిరయ్యాయి. ఆరంభ పోరులో లంకపై, అనంతరం పాకిస్థాన్‌పై సూపర్ విక్టరీలతో జోరు చూపించిన టీమిండియా వరుస ఓటములతో వెనకబడింది. న్యూజిలాండ్‌తో చావోరేవో పోరులో ఓడితే ఇక సెమీస్ ఆశలు గల్లంతే అనుకున్నవేళ ఓపెనర్లు స్మృతి మంధాన ప్రతీకా రావల్ లు సెంచరీలతో చెలరేగారు. జెమీమా రోడ్రిగ్స్ మెరుపు అర్ధ శతకంతో భారీ స్కోర్ చేసిన భారత్.. ఆ తర్వాత ప్రత్యర్థిని కట్టడి చేసి ఊపిరిపీల్చుకుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో వర్షం పదేపదే అడ్డుపడినా బంగ్లాదేశ్‌ను వణికించారు బౌలర్లు. కానీ.. ఫీల్డింగ్ చేస్తుండగా ఓపెనర్ ప్రతీక కుడి కాలి మడిమ గాయంతో టోర్నీకి దూరమైంది. సూపర్ ఫామ్‌లో ఉన్న తను కీలకమైన సెమీస్ ఆడకపోవడం హర్మన్‌ప్రీత్ సేనకు గట్టి ఎదురుదెబ్బే. ఎందుకంటే.. ఆస్ట్రేలియాపై వైజాగ్‌లో మంధానతో కలిసి అర్ధ శతకం బాదేసిన ప్రతీక మరో పెద్ద ఇన్నింగ్స్ ఆడుతుందని అభిమానులు ఆశించగా నిరాశే మిగిలింది. ఆమె స్థానంలో స్క్వాడ్‌లోకి వచ్చిన షఫాలీ వర్మకు ఓపెనింగ్ ఛాన్స్ ఇస్తారా? అనేది తెలియాల్సి ఉంది. ప్రతీక రావడానికి ముందునుంచే మంధానతో ఇన్నింగ్స్ ఆరంభించి.. శుభారంభాలు ఇచ్చిన ఈ లేడీ సెహ్వాగ్‌కు ఛాన్స్ ఇస్తే మాత్రం.. దూకుడుగా ఆడాలని టీమ్ కోరుకుంటోంది. 2017 వరల్డ్ కప్ రెండో సెమీఫైనల్లో ఆసీస్‌పై 171 నాటౌట్ (115 బంతుల్లో) శతకంతో విరుచుకుపడిన హర్మన్‌ప్రీత్ ఈసారి అలాంటి ఒక చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడడం చాలా ముఖ్యం. అలానే.. మిడిలార్డర్లో హర్లీన్ డియోల్, జెమీమా, దీప్తి, రిచా ఘోష్‌లు బ్యాట్ ఝులిపిస్తేనే ఆస్ట్రేలియాకు సవాల్ విసిరే స్కోర్ సాధ్యమవుతుంది. ఎనిమిదిసార్లు ఛాంపియన్ అయిన కంగారూ టీమ్‌ను ఓడించాలంటే బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో టీమిండియా ఇంకాస్త మెరుగవ్వాల్సి ఉంది. గత మ్యాచ్‌లో సెంచరీతో మెరిసిన అలీసా హేలీని త్వరగా ఔట్ చేస్తే కొంతవరకూ ఆసీస్‌పై ఒత్తిడి పెంచవచ్చు. అయితే.. ఇప్పటికే రెండు శతకాలు బాదేసిన అష్ గార్డ్‌నర్, పాక్‌పై దంచేసిన బేత్ మూనీలను పవర్ ప్లేలోనే ఔట్ చేయడానికి రేణుకా సింగ్, క్రాంతి గౌడ్ వ్యూహాలు పన్నాల్సిందే. అలానే డెత్ ఓవర్లలో పరుగులను కట్టడి చేయడం చాలా ముఖ్యం. సెమీస్ ఫలితంతోనే కొత్త ఛాంపియన్ అవతరించేనా? లేదా? అనేది ఖాయమైతుంది. అందుకే.. ఆసీస్, ఇంగ్లండ్ ఆధిపత్యానికి గండికొడుతూ.. భారత్, దక్షిణాఫ్రికా ఫైనల్ చేరాలని యావత్ క్రీడాలోకం కోరుకుంటోంది. అదే జరిగితే.. ఈసారి విశ్వ విజేతగా కొత్త టీమ్‌ను చూస్తాం.జ

# స్పోర్ట్స్

## టీమిండియాతో తొలి టీ20.. ఆసీస్ తుది జట్టులో డేంజరస్ ప్లేయర్లు!




భారత్-ఆస్ట్రేలియా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు రంగం సిద్ధమైంది. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టీ20 కాన్‌బెర్రా బుధవారం(అక్టోబర్ 29) జరగనుంది. టీమిండియాతో వన్డే సిరీస్‌ను సొంతం చేసుకున్న ఆస్ట్రేలియా.. ఇప్పుడు టీ20 సిరీస్‌ను కూడా కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉంది. తొలి టీ20లో ఎలాగైనా గెలిచి సిరీస్‌ను విజయంతో ఆరంభించాలని కంగారులు వ్యూహాలు రచిస్తున్నారు. భారత్ తమ తుది జట్టును ఖరారు చేయడానికి తర్జన భర్జన పడుతుంటే, ఆస్ట్రేలియా మాత్రం ఇప్పటికే తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను ఫైనలైజ్ చేసినట్లు తెలుస్తోంది. ఆసీస్ సెలక్టర్లు ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్ కోసం రెండు వేర్వేరు జట్లను ప్రకటించారు. తొలి రెండు టీ20లకు దూరంగా ఉండనున్న స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్.. ఆఖరి మూడు టీ20లకు ఎంపిక చేసిన జట్టులో మాత్రం చోటు దక్కించుకున్నాడు. అదేవిధంగా యాషెస్ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని స్టార్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్‌కు ఆఖరి మూడు టీ20లకు సెలక్టర్లు విశ్రాంతి ఇచ్చారు.

**టీమిండియా కంటే బెటర్‌గా..**

గతేడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో అఫ్గానిస్తాన్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించిన తర్వాత.. ఆస్ట్రేలియా పొట్టి క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోంది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో వరుస సిరీస్‌ల విజయాలతో ఆసీస్ రెండో స్థానంలో కొనసాగుతోంది. ర్యాంకింగ్స్‌లో కంగారుల కంటే భారత్ ముందుంజలో ఉన్నప్పటికి.. ఇటీవల కాలంలో ఆటగాళ్ల ప్రదర్శన పరంగా కంగారులే మెరుగ్గా కన్పిస్తున్నారు. టీ20 వరల్డ్‌కప్-2024 తర్వాత ఆస్ట్రేలియా ఇప్పటివరకు 19 టీ20లు ఆడి కేవలం కేవలం రెండు మాత్రమే ఓడిపోయింది. ఆసీస్ బ్యాటింగ్ రన్‌రేట్ 10.07గా ఉండగా, భారత్ 9.69తో రెండో స్థానంలో ఉంది. గతంతో పోలిస్తే ఆస్ట్రేలియా బ్యాటింగ్ అప్రోచ్ పూర్తిగా మారిపోయింది. మిచెల్ మార్ష్ నాయకత్వంలోని ఆసీస్ జట్టు ఫియర్ లెస్ బ్యాటింగ్ విధానాన్ని ఎంచుకుంది. ఓపెనర్ల నుంచి ఎనిమిదో స్థానం బ్యాటర్ వరకు హిట్టింగ్ చేసే సత్తా ఉంది. మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్ అద్భుతమైన ఆరంభాలను ఇస్తుండగా.. మిడిలార్డర్‌లో జోష్ ఇంగ్లిష్, టిమి డేవిడ్ వంటి విధ్వంసకర ఆటగాళ్లు మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడుతున్నారు. ఆఖరిలో స్టోయినిష్, ఓవెన్ వంటి ఆల్‌రౌండర్లు తమ పని తాము చేసుకుపోతున్నారు. ఇటీవల కాలంలో పేసర్ ద్వార్షియస్ కూడా బ్యాట్‌తో సత్తాచాటుతున్నాడు. అంతేకాకుండా వికెట్ కీపర్ జోష్ ఫిలిప్ ఛాన్నాళ్ల తర్వాత ఆసీస్ టీ20 జట్టులోకి వచ్చాడు. అతడు కూడా తన బ్యాట్‌కు పనిచెబితే భారత బౌలర్లకు కష్టాలు తప్పవు. ఇక తొలి తొలి టీ20కు స్టార్ స్పిన్నర్ ఆడమ్ జంపా దూరమైనప్పటికి.. జోష్ హాజిల్‌వుడ్, ఈల్లీస్, బార్ట్‌లెట్ వంటి పేస్ పవర్ హౌస్ ఆసీస్ వద్ద ఉంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.